
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ **కోనసీమ** జిల్లా వార్తలు

మంగళవారం 31 డిసెంబరు 2024 | 3



జిల్లాలో తగ్గిన నేరాలు

పోలీసులు విధులను సమర్థవంతంగా నిర్వహించారు

ఎస్పీ కృష్ణారావు

2024 పోలీసు వార్షిక క్రైమ్ నివేదికలు విడుదల



నివేదికను వెల్లడిస్తున్న ఎస్పీ కృష్ణారావు

అమలాపురం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో పోలీసు యంత్రాంగం సమన్వయం, సమర్థవంతమైన సేవలు అందించడం వల్ల నేరాల సంఖ్య తగ్గిందని జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు వెల్లడించారు. సాధారణ ఎన్నికల సమయంలో జిల్లాలో పోలీసులు అందించిన సమర్థమైన సేవలను ఎస్పీ ప్రశంసించారు. రాష్ట్రస్థాయిలో డీజీపీ అందించే అవార్డు ఫర్ బెస్ట్ క్రైమ్ డిటెక్షన్(ఏబీసీడీ) అవార్డులను రెండుసార్లు జిల్లా పోలీసులు అందుకున్నారని ప్రశంసించారు. అమలాపురం పట్టణంలోని కిమ్స్ మెడికల్ కళాశాల ఆవరణలో గల వెంకటేశ్వరాలయంలో జరిగిన చోరీ కేసులో నిందితులను గుర్తించి చోరీ సొత్తును రికవరీ చేయడం, పామర్రు పోలీసుస్టేషన్ పరిధిలో ఎర్రపోతవరం వద్ద అంబేడ్కర్ విగ్రహానికి జరిగిన అవమానం కేసులో నిందితులను వెంటనే గుర్తించి అరెస్టు చేసిన కేసుల్లో కీలకంగా పనిచేసిన పోలీసులకు ఏబీసీడీ అవార్డులు లభించాయని చెప్పారు. అమలాపురంలోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఎస్పీ బి.కృష్ణారావు 2024 పోలీసు వార్షిక క్రైమ్ నివేదికలను వెల్లడించారు. జిల్లాలో పోలీసులు డ్రోన్ టెక్నాలజీని వినియోగిస్తున్నారన్నారు. ఇందుకోసం ప్రతీ పోలీసుస్టేషన్ నుంచి ఒక పోలీసుకు డ్రోన్ వినియోగంపై మొత్తం 25 మందికి శిక్షణ ఇచ్చారని ఎస్పీ చెప్పారు. మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు జరుగుతున్న నేపథ్యంలో వారిని చైతన్యవంతుల్ని చేసేందుకు ఇటీవల జిల్లాలో 435 విద్యా సంస్థల్లో అవగాహన సదస్సులు నిర్వహించామని చెప్పారు. నేరాల రేటులో స్వల్పంగా 0.82 శాతం పెరుగుదల ఉందని, అయితే మహిళలపై నేరాలు 16 శాతం తగ్గాయని చెప్పారు. ప్రమాదకరమైన రోడ్డు ప్రమాదాలు 27 శాతం, ప్రాణాంతకం కాని రోడ్డు ప్రమాదాలు 10శాతం తగ్గినట్టు ఎస్పీ తెలిపారు. గత ఏడాది 6,818 కేసులు నమోదైతే ఈ ఏడాది 6874 కేసులు నమోదయ్యాయని చెప్పారు.

తగ్గిన నేరాలు..

గత ఏడాదిలో 735 కేసులు నమోదైతే ఈ ఏడాది 565 కేసులు నమోదయ్యాయి. కొట్లాట కేసులు గత ఏడాదిలో 558 నమోదైతే ఈ ఏడాది 438 నమోదయ్యాయి. తీవ్రమైన నేరాలు గత ఏడాది 42 జరిగితే ఈ ఏడాది 35 నమోదయ్యాయి. హత్యలు గత ఏడాది 24 జరిగితే ఈ ఏడాది 9 నమోదయ్యాయి. ఇతర శారీరక నేరాలు గత ఏడాది 111 జరిగితే ఈ ఏడాది 83 జరిగాయి. మొత్తం 21 శాతం కేసులు తగ్గుముఖం పట్టాయి. పోక్సో కేసుల్లో గత ఏడాదితో పోలిస్తే 31 శాతం తగ్గుదల కనిపించింది. దాదాపుగా నమోదైన అన్ని కేసుల్లోను 60 రోజుల్లోనే విచారణ పూర్తి చేశారు. మోసాలు, ఇతర నేర అభియోగాలపై గత ఏడాది 284 కేసులు న మోదుకాగా ఈ ఏడాది 219 కేసులు నమోదయ్యాయి. ఈ ఏడాది 23శాతం కేసుల్లో తగ్గుదల కనిపించింది. సైబర్ నేరాల దర్యాప్తు కోసం జిల్లాలో ప్రత్యేక టెక్నికల్ ఎనాలసిస్ వింగ్‌ను ఏర్పాటు చేసి దర్యాప్తులోనే, నిందితుల అరెస్టులో సాంకేతికంగా సహాయం అందిస్తున్నామని ఎస్పీ తెలిపారు. గత ఏడాది 80 సైబర్ నేరాలు నమోదు కాగా ఈ ఏడాది 44 కేసులు మాత్రమే నమోదయ్యాయి. చోరీకి గురైన 302 సెల్‌ఫోన్లను ట్రాకింగ్ సిస్టమ్ ద్వారా రికవరీ చేశాం. వీటి విలువ రూ.45.30లక్షలు ఉంటుందని ఆయన తెలిపారు. గత ఏడాదిలో 652 రోడ్డు ప్రమాదాలు జరగ్గా ఈ ఏడాది 553 ప్రమాదాలు జరిగాయి. గతంతో పోలిస్తే ప్రమాదాల సంఖ్య తగ్గింది. రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో 18 బ్లాక్ స్పాట్‌లు గుర్తించాం. మూడు హైవే పెట్రోలింగ్ వాహనాలు ఏర్పాటుచేసి మోనటరింగ్ చేస్తున్నాం. ఈ ఏడాది 2020 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, 1936 బహిరంగ మద్యం సేవించడం కేసులు నమోదయ్యాయి. గత ఏడాదిలో 60 ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదైతే ఈ ఏడాది 57 కేసులు నమోదయ్యాయి. మహిళలపై నేరాలు గత ఏడాది కంటే తగ్గాయి. గతంలో 660 కేసులు నమోదైతే ఈ ఏడాది 554 కేసులు నమోదయ్యాయి. గత ఏడాది 499 దొంగతనం కేసులు నమోదైతే ఈ ఏడాది 404 కేసులు మాత్రమే నమోదయ్యాయి. మొత్తం 19 శాతం తగ్గింది. ఈ ఏడాది 46 హత్యాచార కేసులు నమోదై గత ఏడాది కంటే 19.29 శాతం తగ్గాయి. 219 చీటింగ్ కేసులు నమోదయ్యాయి. గత ఏడాది 44 ఎన్డీపీఎస్ కేసులు నమోదైతే ఈ ఏడాది 10 కేసులు మాత్రమే నమోదయ్యాయి. గ్యాంబ్లింగ్ కేసులు 690 నమోదు కాగా 2729 మందిని అరెస్టుచేసి వారి నుంచి రూ.40.59 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు జిల్లాలో ఇతర నేరాలు, వివిధ కేసుల్లో శిక్షలు పడిన వారి సమాచారాన్ని జిల్లా ఎస్పీ వివరించారు. వివిధ కేసుల్లో కీలకంగా పనిచేసి పోలీసు యంత్రాంగానికి గుర్తింపు తెచ్చిన పలువురు పోలీసు అధికారులకు జిల్లా ఎస్పీ కృష్ణారావు ఈ సందర్భంగా రివార్డులను అందజేశారు. విలేఖరుల సమావేశంలో అడ్మిన్ ఎస్పీ ప్రసాద్, ఎస్బీ సీఐ రాజశేఖర్, వి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి నోడల్ అధికారులు

పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలి

కలెక్టర్ మహేష్‌కుమార్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సకాలంలో సమస్యలు పరిష్కరించే దిశగా నోడల్ అధికారులు పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సూచించారు. సుపరిపాలనే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రజాసమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. అర్జీల పరిష్కారంపై నోడల్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి కలెక్టర్ మహేష్‌కుమార్‌తో పాటు జేసీ టి.నిషాంతి, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, ఐసీడీఎస్ పీడీ ఎం.ఝాన్సీరాణి 165 ఫిర్యాదులను స్వీకరించారు. దివ్యాంగుల వద్దకు జేసీ నిషాంతి నేరుగా వెళ్లి అర్జీలను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మండల, డివిజన్ స్థాయిల్లో సంబంధిత అధికారులతో పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేస్తూ అక్కడికక్కడే సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మండల స్థాయి నుంచి మీ కోసం కార్యక్రమం నిర్వహిస్తున్నారన్న విషయాన్ని విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ కార్తీక్, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, జిల్లా పంచాయతీ అధికారి డి.శాంతలక్ష్మి, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పీకేపీ ప్రసాద్, సీపీవో వెంకటేశ్వర్లు, ట్రాన్స్‌కో ఎస్ఈ ఎస్.రాజబాబు, డీఎస్‌వో ఉదయభాస్కర్, డీఐపీఆర్వో కె.లక్ష్మీనారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సీహెచ్ఎన్వీ కృష్ణారెడ్డి, వికాస జనరల్ మేనేజర్ గోళ్ల రమేష్ వివిధ శాఖలకు చెందిన జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

జనవరి 10 నాటికి

పల్లె పండుగ పనులను పూర్తిచేయాలి

కలెక్టర్ మహేష్‌కుమార్



అమలాపురం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): జనవరి 10 నాటికి ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పల్లెపండుగ పనులను పూర్తి చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి మండలస్థాయి అధికారులతో సోమవారం కలెక్టర్ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి ప్రభుత్వ ప్రాధాన్యత అంశాల పురోగతిపై మండలాల వారీగా సమీక్షించారు. సీసీ రోడ్లు, పశువుల షెడ్ల నిర్మాణాలను పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో గుర్తించిన ఖాళీ స్థలాల్లో ఫలసాయాన్ని ఇచ్చే పండ్ల మొక్కల సాగుకు అవసరమైన మొక్కలు కొనుగోలు చేసేందుకు అంచనాలు రూపొందించాలని ఆదేశించారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా పీఏసీఎస్‌ల ఈకేవైసీ ప్రక్రియ 166 కేంద్రాల్లో పూర్తి చేయాలని, హౌస్ హోల్డ్ జియో ట్యాగింగ్ ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలన్నారు. సామాజిక భద్రతా పెన్షన్లను 31వ తేదీన అందించేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. అన్న క్యాంటీన్ల నిర్వహణపై దృష్టి సారించాలన్నారు. డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, డీఎల్డీవో ఎస్.త్రినాథరావు, పంచాయతీ రాజ్ ఎస్ఈ పి.రామకృష్ణారెడ్డి, డీఈ పీఎస్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రివ్యూ ఆంధ్రజ్యోతి Review 2024



8 ఏ ఎక్కడున్నావో.. చూసుకో!

ఎక్కడ నెగ్గాలో కాదు.. ఎక్కడ తగ్గాలో తెలిసినోడు గొప్పోడు.. దర్శకుడు త్రివిక్రమ్ అత్తారింటికిదారేది సినిమాలో రాసిన డైలాగ్ ఇది. ఈ ఏడాది ఆ డైలాగ్‌నే నిరూపించింది.. గతేడాది చంద్రబాబును జైలులో పరామర్శించి పొత్తు పెట్టుకుని తగ్గిన పవన్.. ఈ ఏడాది ఎన్నికల్లో నువ్వా నేనా అంటూ తలపడి.. కాచుకో జగన్ అంటూ శపథం చేసి మరీ గోదావరి జిల్లాల్లో వైసీపీని తుడిచిపెట్టేశారు.. కూటమిని విజయపతాకాన చేర్చారు.. పిఠాపురాన నెగ్గి డిప్యూటీ సీఎంగా బాధ్యతలు స్వీకరించారు.. ఇక 2024 లో మిగిలింది కొన్ని గంటలే.. 2024 కలిపితే 8.. ఏ 8లో ఉన్నామో చూసుకునే సమయం వచ్చేసింది.. ఓటరు అనుకున్నది సాధించాడు.. కూటమిని గెలిపించాడు.. సూపర్ సిక్స్‌లో ఇప్పటికే రెండు హామీలు నెరవేర్చింది. వైసీపీని జీరో చేసింది.. మద్యం పాలసీ మార్చింది.. ఉచిత ఇసుక విధానానికి శ్రీకారం చుట్టింది.. జిల్లా నలు దిక్కులా అభివృద్ధికి బాటలు వేస్తున్నారు.ఒక్కసారి 12 నెలలు వెనక్కు వెళితే ఈ ఏడాది బాధకంటే ఆనందమే ఎక్కువ.. మరలిరాని క్షణాలు మననం చేసుకుందాం.. కొత్త ఏడాది 2025కి స్వాగతం చెబుదాం..

మరలిరాని క్షణాలు.. చెరిగిపోని జ్ఞాపకాలు

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

కరిగిపోయే కాలంలో మిగిలిపోయే జ్ఞాప కాలు ఎన్నో ఉంటాయి. అందులో కొన్ని సంతోషాన్నిస్తే..మరికొన్ని విషాదాన్ని నింపుతాయి.. మరికొన్ని మనసును పిండేస్తే..ఇంకొన్ని భయాందోళనలకు గురిచేస్తాయి. ఇవన్నీ ఒక్క ఏడాదిలోనే చోటు చేసుకుంటే అదే 2024. మరికొన్ని గంటల్లో చరిత్ర పుటల్లో కలిసి పోనున్న 2024 ఏడాది ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు ఉగాది పచ్చడిలా అన్ని రకాల భావోద్వేగాలను పంచింది.ఎన్నో ఏళ్ల నుంచి ఎదురుచూస్తోన్న ప్రజాకంటక పాలనకు చరమగీతం పలికి తూర్పుగోదావరి జిల్లా ప్రజలను సంబరాలు చేసుకునేలా చేసిందీ ఏడాది.పిల్లాపాపలతో ప్రతి ఒక్కరూ రోడ్డెక్కి కూటమి విజయాన్ని తమ విజయంగా పండుగ చేసు కున్న ఈ ఏడాదిగా ప్రతి ఒక్కరిలో తీపి జ్ఞాపకాలు పంచింది. అటు అవ్వా తాతలకు పింఛన్ పెరిగి మోముపై చిరునవ్వులు పూయించగా, ఉచిత గ్యాస్ సిలిండర్ చేతికి అందడంతో పేద,మధ్య తరగతి ప్రజల్లో ఆనందాలు మిన్న ంటాయి.అటు ఈ ఏడాది ఆగస్టు, సెప్టెంబరులో వర్షాలు, గోదా వరి,ఏలేరు వరదలతో ఉమ్మడి జిల్లా చిగురు టాకులా వణికి పోయింది.దారి తప్పిన పులులు రాజమహేంద్రవరం,ప్రత్తిపాడులో సంచరిస్తూ కొన్ని వారాలను జనాలను బెంబేలెత్తించింది ఈ ఏడాది లోనే.అటు సీజ్ ద షిప్ అన్న పవన్ వ్యాఖ్యలతో రాష్ట్రవ్యాప్తంగా జిల్లా పేరు మార్మోగి పోయింది. అదే సమయంలో సంచలనాత్మ కమైన వరుస హత్యలు,రక్తపుటేరులు పారిం చిన రోడ్డు ప్రమాదాలు.. జేబులు గుల్ల చేసే సిన సైబర్ నేరాలు ఉమ్మడి జిల్లాను కలవర పెట్టా యి. అటు అఖండ గోదావరికి ఇన్నేళ్లకు రూ.100 కోట్లు మంజూరై హేవలాక్ వంతెన రూపు మార్చు కోబోతుండడం, శుచి, శుభ్రతలో అన్నవరం ప్రసాదానికి జాతీయస్థాయిలో గుర్తింపు రావడం అందరినీ ఆనందపరిచాయి.

- » చరిత్ర పుటల్లో 2024
- » ఓటు విలువ చాటిన ఏడాది
- » కూటమి విజయఢంకా
- » శపథం చేసి గెలిచిన పవన్
- » జిల్లాలో వైసీపీ జీరో
- » మూడు మంత్రి పదవులు
- » తుఫాన్‌లు.. విషాదాలు
- » ఏడాదికి మిగిలింది గంటలే



6 కాకెత్తిన కాకినాడ

ఈ ఏడాదిలో ఒకే ఒక్క మాట ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా కాకినాడ పేరు మార్మోగేలా చేసింది. అదే స్టెల్లా నౌక.బియ్యం లోడింగ్ కోసం వచ్చిన నౌకలో రేషన్ బియ్యం పట్టుబడడంతో డిప్యూటీ సీఎం పవన్ కాకినాడకు వచ్చి సీజ్ ద షిప్ అన్నారు.ఈ డైలాగ్ విపరీతంగా వైరల్ అయింది.దీనికి తగ్గట్టుగా కాకినాడ పోర్టు చరిత్రలో ఎప్పుడలేని విధంగా ఏకంగా 50 రోజులకు పైనే షిప్ నిలిచిపోవడం రాష్ట్ర వ్యాప్తంగా కాకినాడ పేరును మార్మోగేలా చేసింది. అటు రేషన్ బియ్యం స్మగ్లింగ్ వ్యవ హారంలోను కాకినాడ పోర్టు పేరు మోతె క్కింది.ఇక్కడి నుంచి విదేశాలకు తరలి పోయిన పేదల బియ్యం అంశం కొన్ని వారాలపాటు చర్చనీయాంశంగా మారింది.కాకినాడ సీపోర్టులో వాటాలను వైసీపీ నాయకులు గన్ పెట్టి బెదిరించి రాయించేసుకు న్నారన్న కేవీరావు ఫిర్యాదుతో మరోసారి తూర్పుగోదావరి జిల్లా పేరు చర్చనీయాంశం అయ్యేలా చేసింది.

ఎంత సంతోషమో.. 1



వైసీపీ ఐదేళ్ల పాలనకు విముక్తి కలిగించి ఉమ్మడి జిల్లా ప్రజలకు సాంత్వన చేకూర్చి సంతోషాన్ని మిగిల్చిన ఏడాదిగా 2024 అందరికీ గుర్తుండి పోనుంది.పన్నుల వాత..చార్జీల మోత.. సోషల్ మీడియా పేరుతో అరెస్టులు.. ప్రజ ల వారసత్వ ఆస్తులు లాగేసుకునేలా లాండ్ టైట్లింగ్ యాక్ట్‌లతో ఉమ్మడి జిల్లా ప్రజలకు వైసీపీ కం టిపై కునుకు లేకుండా చేసింది. ఈ ప్రజాకంటక పాలనకు ఈ ఏడాది మేలో వచ్చిన అసెంబ్లీ ఫలితాలతో ఒక్కసారిగా ప్రజల్లో ఆనందం కట్టలు తెచ్చేకునేలా చేసింది. ఇన్నేళ్ల నరక యాతనకు ముగింపు పలికిందన్న సంతోషం ఉమ్మడి జిల్లాలో పెల్లుబికింది. మొత్తం అన్ని అసెంబ్లీ సీట్లలో వైసీపీ ఓడిపోవడంతో జిల్లాలో సంబరాలు మిన్నంటా యి. అటు కూటమి ప్రభుత్వం రాగానే ఎప్పుడూ లేని విధంగా వరుస నామినేటెడ్ పదవుల పందేరంతో ఉమ్మడి జిల్లాలో మూడు పార్టీల నేతలు,కార్యకర్తల్లో సంతోషం తొణకిసలాడింది. దాదాపు అన్ని నియోజకవర్గాలకు పదవులు దక్కడంతో నేతలు సంబరాలు చేసుకున్నారు.

అభివృద్ధి దిశగా.. 2

అఖండ గోదావరి ప్రాజెక్టు కింద దాదాపుగా రూ.100 కోట్లు రాజమహేం ద్రవరానికి నిధులు మంజూరవడం గోదావరి వాసులను పులకరింప చేసింది. గోదావరిపై ఉన్న హేవ్‌లాక్ వంతెన ఆధునీకీకరణకు అడుగులు పడడంతో పర్యాటక ప్రియులకు సంతోషం పం చింది.అన్నవరం ప్రసాదానికి జాతీయస్థాయిలో మరో సారి గుర్తింపు లభించిందీ ఈ ఏడాదిలోనే. సుచి,శుభ్రతలో భారత ఆహార ప్రమాణాల సంస్థ గుర్తింపు ఇవ్వడం భక్తులను ఆనందపరిచింది.

పింఛన్..పెంచెన్.. 3

ఒక్కసారిగా పింఛన్ డబ్బులు పెరగ డంతో ఆయా వర్గాలు సంబరాలు చేసుకున్నాయి. సూపర్‌సిక్స్ పథకం అమల్లో భాగంగా దీపావళికి ఉచితగ్యాస్ సిలిండర్‌ను కూటమి ప్రభుత్వం అం దించడంతో మహిళల్లో ఆనం దం వెల్లివిరిసింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రాతిపదికన వచ్చే ఏడాది ఉగాది నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అమలు చేయడానికి ప్రభుత్వం అడుగులు వేస్తున్న విషయం తేల డంతో మహిళల ఆనందానికి అంతు లేకుండా పోయింది. మరోపక్క మద్యం దుకాణాలు బడా వ్యాపారుల చేతుల్లోనే ఉంటాయన్న నానుడికి చరమగీతం పాడి కూటమి ప్రభుత్వం లాటరీ పద్ధతిలో మద్యం దుకాణాలను కేటాయించడంతో ఉమ్మడి జిల్లాలో అతి సామాన్యులు, పేదలకు జాక్‌పాట్ తగిలింది.



7 వావ్ అనిపించేలా

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాను అనేక మంది దేశరాజధాని ఢిల్లీకి వివిధ పనులపై వెళతారు.కానీ జిల్లా నుంచి నేరుగా విమానం లేదు. కానీ 2024 ఏడాది జిల్లావాసులకు ఆ లోటు తీర్చే సింది. రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టు నుంచి నేరుగా ఢిల్లీకి ఇండిగో డిసెంబర్ నుంచి సర్వీ సులు ప్రారంభించింది. ఒకరకంగా జిల్లా ప్రజలకు ఇది తీపికబురు. అటు కాకినాడలో కొత్త ఎయిర్ పోర్టు, తుని-అన్నవరం మధ్య ఎయిర్‌పోర్టు లేదా ఎయిర్ స్ట్రిప్ నిర్మాణం చేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో సర్వత్రా విమాన ప్రయాణి కులకు కిక్ ఇచ్చి వావ్ అనిపించింది. కాకినాడలో డిసెంబర్‌లో నకిలీ పిస్టల్‌ను గురిపెట్టి ఓ జ్యూయలరీ దుకా ణంలో బంగారం చోరీ చేసి పారిపోతున్న నింది తుడిని పోలీసులు సినిమా ఫక్కీలో ఛేజ్ చేసి పట్టుకుని వావ్ అనిపించుకున్నారు.అన్నవరం లోను ఇలాగే బంగారంతో పారిపోతున్న ఓ నిందితుడిని స్థానికులు వెంబడించి పట్టుకున్నారు.





జీవితాల్లో పెను తుఫాన్ 4

ఈ ఏడాది ఉమ్మడి జిల్లాకు సంతోషంతోపాటు దుఃఖాన్ని పంచింది. ప్రధానంగా ఎడతెరిపి లేని వర్షాలు, తుఫాన్‌లు ప్రజలను నానా ఇబ్బందులు పెట్టాయి. ఆగస్టు, సెప్టెంబరులో కురిసిన భారీ వర్షాలు, గోదావరి, ఏలేరు వరదలైతే వారాల తరబడి ప్రజలను బెంబేలెత్తించాయి.ఒక్క ఏలేరు వరద ధాటికే రూ.172 కోట్ల నష్టం వాటిల్లినట్టు లెక్కగట్టారు. కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే కృష్ణబాబు మరణం ఎందరినో కలచివేసి విషాదంలోకి నెట్టింది.

5 ఎంత విషాదమో..

ఈ ఏడాది సంచలనాత్మక హత్యలు, ఇతర నేరాలు, రోడ్డుప్రమాదాలు, సైబర్ నేరాలు ఉమ్మడి జిల్లాలో ఎంతో విషాదం నింపాయి.ప్రధానంగా దీపావళి రోజు కాజులూరు మండలం శల పాక లో చోటుచేసుకున్న మూడు హత్యలు ఉమ్మడి జిల్లాను ఉలిక్కిపడేలా చేశాయి.ఆ తర్వాత డిసె ంబరులో సామర్లకోట మండలం వేట్ల పాలెంలో మూడు హత్యలు మళ్లీ భయ పెట్టా యి.ఈ రెండు నేరాల్లోను కత్తులు, గునపా లతో ప్రత్య ర్థులను పొడిచి చంపిన తీరు ప్రత్యర్థులు నేర స్వభావాన్ని చూపింది. రాజమ హేంద్రవరం సమీపంలో రేవ్‌పార్టీ వ్యవహారం బయటపడ డంతో అంతా ఉలిక్కిపడ్డారు. మారే డు మిల్లిలో విహారయాత్రకు వచ్చి జలపాతంలో ఏలూరుకు చెందిన ముగ్గురు వైద్యవిద్యార్థినులు గల్లంతై ఆ తర్వాత చనిపోవడం తీవ్ర విషాదం నింపింది. వివిధ రోడ్డు ప్రమాదాల్లో ఉమ్మడి తూర్పుగోదా వరి జిల్లాలో సుమారు 800 వరకూ మృత్యువాత పడడం ఆయా కుటుంబాల్లో వేదన మిగిల్చింది.



8 భయపెట్టిన పులులు..

ఈ ఏడాది పులుల సంచారం ఉమ్మడి జిల్లా ప్రజలకు కంటిపైకునుకు లేకుండా చేశాయి. సెప్టెంబరులో రాజమహేంద్రవరం దివాన్‌చెరువు సమీపంలో పులి అడుగు జాడలు రాజమ హేంద్ర వరం వాసులను బెంబేలెత్తించాయి. కొన్ని వారాల పాటు పులి సంచారం ప్రజలను పరు గులు తీయించింది. బయటకు వస్తే ఏమవు తుందోననే భయంతో బిక్కుబిక్కుమన్నారు. ఆ పులి ఏమైందో తెలియదు కానీ..ఆ తర్వాత డిసెంబరులో ప్రత్తిపాడులో పులి సంచారం ప్రచారం జిల్లాను వణికించింది.

ఏ నెలలో ఏం జరిగిందంటే..

జనవరి 6: దివాన్‌చెరువు గైట్ క్యాంపస్‌లో రెండో అంతర్జాతీయ తెలుగు మహాసభలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి.జనవరి 25: ఉమ్మడి తూర్పు జిల్లాలో చంద్రబాబు సతీమణి భువనేశ్వరి పర్యటించి చంద్రబాబు అరెస్టును తట్టుకోలేక మరణించిన కుటుంబాలకు రూ.3 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. జనవరి 30:రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరులో టీడీపీ అధినేత చంద్రబాబు రా..కదలిరా సభనిర్వహించారు.లక్షలాది జనం తరలివచ్చారు.

ఫిబ్రవరి 12: అల్లూరి జిల్లా రంపచోడవరం మండలం ఐ.పోలవరం సమీపంలోని సీతపల్లి వాగులో పడి రంపయర్రంపాలెం గ్రామానికి చెందిన ముగ్గురు విద్యార్థులు మృతి చెందారు.ఫిబ్రవరి 27: ప్రత్తిపాడు సమీపంలో పాదాలమ్మ గుడివద్ద లారీడ్రైవర్లపై ఆర్టీసీ బస్సు దూసుకెళ్లింది. నలుగురు అక్కడికక్కడే మృతిచెందారు.

మార్చి 12:ముద్రగడ పద్మనాభం వైసీపీలో చేరారు.మార్చి 25:కాకినాడ సాగరతీరంలో ఇండో-యుఎస్ఏ నావికాదళ విన్యాసాలు జరిగాయి. మార్చి 30: పిఠాపురంలో జనసేన అధినేత పవన్ తొలిరోజు ఎన్నికల ప్రచార సభ నిర్వహించారు.

ఏప్రిల్4: తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో విజయవంతంగా ప్రజాగళం సభ నిర్వహించిన టీడీపీ అధినేత చంద్రబాబు.. ఏప్రిల్ 11: అమలాపురం,పి.గన్నవరంల్లో చంద్రబాబు,పవన్ పర్యటన ఏప్రిల్ 19:వాడపల్లి వెంకన్న కల్యాణం.

మే 7: రాజమహేంద్రవరంలో టీడీపీ, బీజేపీ, జనసేన సభ.. హాజరైన మోదీ, పవన్, లోకేశ్. మే 13: ఓటెత్తిన జనం.. కోనసీమలో 82.61 శాతం, కాకినాడలో 74.24,తూర్పున 79.43 శాతం పోలింగ్.మే 14:మే 21: కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే కృష్ణబాబు అనారోగ్యంతో హైదరాబాద్‌లో మృతి చెందారు.మే 28:అనారోగ్యంతో సంపర మాజీ ఎమ్మెల్యే అనిశెట్టి బుల్లిఅబ్బాయిరెడ్డి మృతి చెందారు.

జూన్ 4: కూటమిదే విజయం. గోదారి ఓట్ల వరదలో ఫ్యాన్ గల్లంతు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో ఉమ్మడి తూ.గో.జిల్లాలో 22 సీట్లలో వైసీపీ ఘోర పరాజయం.జూన్ 12: మూడు జిల్లాలకు ముగ్గురు మంత్రులు..డిప్యూటీ సీఎంగా పవన్ కల్యాణ్, కేబినెట్‌లో దుర్గేష్, సుభాష్‌లకు చోటు . జూన్ 20: ప్రొటెం స్పీకర్‌గా ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరికి అసెంబ్లీలోగౌరవం కల్పించారు.

జూలై 1: కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో పెంచిన పింఛన్లను పిఠాపురంలో ప్రారంభించిన డిప్యూటీ సీఎం పవన్. జూలై 3: పిఠాపురంలో భూమి కొన్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

ఆగస్టు 5: కొవ్వూరు మండలం కుమారదేవంలో నూట 150ఏళ్ల చరిత్ర కలిగిన సినిమా చెట్టు కూలింది.ఆగస్టు 16: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అన్నక్యాంటీన్లు పునఃప్రారంభం

సెప్టెంబరు 5: వరదలతో ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక...కోనసీమకు వరద ముప్పు..పంపా రిజర్వాయర్‌కు పోటెత్తిన వరద. సెప్టెంబరు 8:రాజమహేంద్రవరం రిజర్వు ఫారెస్టులో చిరుత సంచారం.సెప్టెంబరు 11 : ఏలేరు వరద ప్రాంతాల్లో సీఎం చంద్రబాబు పర్యటన

అక్టోబరు 19: జనసేనలో చేరిన ముద్రగడ పద్మనాభం కుమార్తె బార్లపూడి క్రాంతి. అక్టోబరు 22: ఆర్థిక ఇబ్బందులతో కోనసీమ జిల్లా అంబాజీపేటలో దంపతుల ఆత్మహత్య.

నవంబరు 1: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉచిత గ్యాస్ బుకింగ్ ప్రారంభం. కాకినాడ జిల్లా కాజులూరు మండలం శలపాకలో ముగ్గురు దారుణ హత్య.నవంబరు 9:రుడా చైర్మన్‌గా బీవీఆర్ చౌదరి..రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్‌గా కుడుపూడి సత్తిబాబు.నవంబరు 12: వైసీపీకి కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి రాజీవ్‌కృష్ణ రాజీనామా.

డిసెంబరు 4: విలీన మండలాల్లో స్వల్ప భూప్రకంపనలతో బెంబేలెత్తిన ప్రజలు.డిసెంబరు 4: సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్‌గా ఉన్న పెందుర్తి వెంకటేశ్‌కి తొలిసారి క్యాబినెట్ హోదా కల్పించారు.డిసెంబరు 9: ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా పీడీఎఫ్ అభ్యర్థి గోపిమూర్తి గెలుపు డిసెంబరు 12: రాజమహేంద్రవరం నుంచి ఢిల్లీకి విమానం సర్వీసులు..



కొట్లాటకు సై కోడి రెడీ

మెట్టలో పందాలకు క్రేజ్

- సంక్రాంతి పందాలకు పుంజులు సిద్ధం
- ఫారాల నిర్వాహకులకు కాసులే.. కాసులు
- కోడిపుంజులు కొంటున్న పందెం రాయుళ్లు
- రూ.లక్షల్లో అమ్ముడవుతున్న పందెం పుంజులు
- ఉమ్మడి జిల్లాలో 300కి పైగా నాటుకోళ్ల ఫారాలు
- ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్న పుంజులు
- అధిక లాభాలు పొందుతున్న వ్యాపారులు



గండేపల్లి, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి వస్తుందంటే కొత్త అల్లుళ్లతో గ్రామాలన్నీ సందడిగా మారతాయి. ముఖ్యంగా కోడిపందేలు అంటే ఎప్పటినుంచో సంప్రదాయంగా మారుతున్న క్రీడ ఇది. నాటుకోళ్ల ఫారాల వ్యాపారుల కూడా సంవత్సరానికి ఒకసారి కాసులు కురిపించే వ్యాపారమిది. ప్రస్తుతం సంక్రాంతి కూడా దగ్గరపడింది. ఇంకా నెలరోజుల్లో సంక్రాంతి ఉంది. దీంతో నాటుకోళ్ల నిర్వాహకులు ఇప్పటినుంచే సొమ్ములు చేసుకోవడం మొదలు పెట్టారు. సంక్రాంతి సమయానికి ముందే ఈ కోళ్ల విక్రయాలు చేసి సొమ్ములు చేసుకుంటారు. అధిక లాభాలు పొందుతారు. ఈ నెలరోజుల కాలంలోనే అధిక లాభాలు వస్తాయి. పుంజులకు పందెం రాయుళ్లు శిక్షణ ఇచ్చే పనిలో పడ్డారు. పుంజులకు గంట్లు, పచ్చి ఉల్లిపాయ ముక్కలు, మేకమాంసం పెడుతున్నారు. వాటికి చెరువుల్లో ఈత కొట్టిస్తూ శిక్షణ ఇస్తున్నారు. పందెంలో మన పుంజే గెలవాలనే తాపత్రాయంతో పుంజులను మేపుతున్నారు. కోడి పుంజుల్లో నెమలి, పచ్చకాకిలకు మంచి డిమాండ్ పలుకుతోంది. ఇప్పటికే కోళ్ల ఫారాలనుంచి ఏపీ, తెలంగాణకు సంబంధించిన పందెంరాయుళ్లు పుంజులను లక్షల్లో కొనుగోలు చేసినట్లు పలువురు ఫారం నిర్వాహకులు చెపుతున్నారు. ఉమ్మడి జిల్లాలో 300కిపైగా నాటుకోళ్ల ఫారాలు ఉన్నాయి. సంక్రాంతి పండుగ మూడురోజులు సంప్రదాయబద్ధంగా పందేలు నిర్వహిస్తారు. పందెంలో గెలిచిన కోస మాంసానికి మంచి డిమాండ్ పలుకుతుంది. దీంతో ఈ ఏడాది పందేలు ఎలా ఉంటాయో వేచి చూడాల్సిందే.



పందెం పుంజులకు డిమాండ్

సంక్రాంతి దగ్గర పడడంతో నాటుకోళ్ల ఫారాల్లో ఉన్న పందెం పుంజులకు మంచి గిరాకీ ఉంది. రూ.25వేల నుంచి రూ.లక్ష వరకు పుంజుల ధర పలుకుతోంది. నాటుకోళ్ల ఫారం నిర్వాహకులు కోడిపుంజుల విక్రయాలు చేపడుతున్నారు. నెమలి రూ.40వేలు, పచ్చకాకి రూ.50వేలు, కాకిడేగ రూ.35వేలు, చేదువ రూ.50వేలు, కోడిడేగ రూ.25వేలు, రసంగి రూ.50వేలు, నల్లడేగ రూ.60వేలకు పైగా ధరలు పలుకుతున్నాయి. పుంజు రకాన్ని బట్టి పందెరాయుళ్లు కొనుగోలు చేస్తున్నారు. దీంతో పందెం పుంజులు మేపే నిర్వాహకులకు కాసులు కురిపిస్తున్నాయి.





- ఇతర రాష్ట్రాల నుంచి పందెంరాయుళ్ల రాక
- ట్రయల్ పందేలు నిర్వహిస్తున్న నిర్వాహకులు
- సిద్ధమవుతున్న బరులు
- రూ.లక్షల్లో పందాలు?

సామర్లకోట/జగ్గంపేట, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలోని మెట్టప్రాంతంలో కోడిపుంజులు పందేలకు సిద్ధమవుతున్నాయి. ఇక్కడ జరిగే కోడి పందేలు చూసేందుకు తెలంగాణ, తమినాడు, ఒడిశా రాష్ట్రాలనుంచి జనం తరలివస్తుంటారు. రూ.లక్షల్లో పందేలు కూడా పడుతుంటారు. గతేడాది మూడురోజులకు కలిపి ఈ ఒక్క ప్రాంతంలోనే రూ.6కోట్ల పందేలు జరిగాయని చెప్తుంటారు. వచ్చే ఏడాది సంక్రాంతి సమయంలో జరిగే కోడిపందేలకు మెట్టప్రాంతంలోని జగ్గంపేట, ప్రత్తిపాడు, పిఠాపురం, పెద్దాపురం, తుని నియోజకర్గాలతోపాటు కాకినాడ, సామర్లకోట ల్లోను ఇప్పటికే బరులను సిద్ధం చేశారు. సవల, కొక్కిరాయి. రసంగి, సేతువ జాతి కోడిపుంజులకు డిమాండ్ బాగా ఉంది. కొందరు ఇప్పటికే వాటిని పెంపకం దారులనుంచి కొనుగోలు చేసి ట్రయల్ పందేలు నిర్వహిస్తున్నారు.



అద్దెకు ఈ-స్కూటర్లు

- స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రణాళిక
- కాకినాడ నగరంలో పది సెంటర్లలో ఏర్పాటు
- పొల్యూషన్, ట్రాఫిక్ నియంత్రణే లక్ష్యం

ఆంధ్రజ్యోతి/కార్పొరేషన్ (కాకినాడ): నగరంలో రోజురోజుకు పెరుగుతున్న పొల్యూషన్, ట్రాఫిక్ జామ్, వాహనాల రద్దీని దృష్టిలో పెట్టుకుని అధికారులు అందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. కాకినాడ స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ-స్కూటర్లను రోజువారీ అవసరాలకు అద్దెప్రాతిపదికన నడిపేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. అందుకుగాను ఇప్పటికే 13 ఈ స్కూటర్లను భువనేశ్వర్ నుంచి దిగుమతి చేశారు. ఈ ప్రాజెక్టును ప్రజల ఎంతవరకు సద్వినియోగం చేసుకుంటారనే దానిపై ప్రజాభిప్రాయ సేకరణకు కాకినాడ నగరంలోని ప్రధాన జంక్షన్‌లో ఇప్పటికే డెమో నిర్వహించి ప్రజల దగ్గర నుంచి అభిప్రాయాలు సేకరించారు.



ఫీచర్లు, రేంజ్..

ఈ-స్కూటర్‌ను రోజువారీగా 100 కిలోమీటర్ల కంటే ఎక్కువ పరిధి వరకు వినియోగించవచ్చు. సుదీర్ఘ ప్రయాణాల సమయంలో రైడర్ల సౌకర్యం, భద్రత కోసం ఈ-బైక్ ఎర్గోనామిక్స్‌ను కలిగి ఉంటుంది. స్లో స్పీడ్ ఎలక్ట్రిక్ వాహనం. దీని గరిష్ఠ వేగం గంటకు 25కిలోమీటర్లు. ఇందులో యాంటీ వాండలిజం, యాంటీథెఫ్ట్, కీలెస్ స్టార్ట్, జీపీఎస్ ట్రాకింగ్, బ్యాటరీ మెకానిజం వంటి ఫీచర్లు ఉన్నాయి.

గతంలో నగరంలో ఎక్కడికైనా వెళ్లాలంటే రిక్షాలపై ప్రయాణించేవారు. తర్వాతకాలంలో వాటి స్థానంలో సిటీ బస్సులను ఆశ్రయించేవారు. ఆ తర్వాత ఆటోల రాకతో సిటీ బస్సులు కూడా కనుమరుగయ్యాయి. దీంతో నగరంలో పెరుగుతున్న వాహనాల సంఖ్యతో అదే స్థాయిలో పొల్యూషన్ కూడా పెరుగుతోంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని అధికారులు పొల్యూషన్, ట్రాఫిక్ నియంత్రించేందుకు ఈ-స్కూటర్లను అద్దెప్రాతిపదికన ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఏర్పాట్లు చేస్తున్నారు. ఎవరికి ఏ అవసరమున్నా వాటిని రోజువారీ, నెలవారీ అద్దెకి తీసుకుని వాటిని ఉపయోగించుకోవచ్చని చెప్తున్నారు. ఇవి పూర్తిగా జీపీఎస్ కంట్రోల్‌లో ఉంటాయని, మనం ఎక్కడికి వెళ్లినా నిర్వాహకులకు తెలుస్తుందని, వాటిని దొంగిలించాలనుకున్నా నిర్వాహకులు ఈ బైకులను నియంత్రించగలరు. ఈ విధానం ఇప్పటికే బెంగుళూరు, చెన్నై వంటి ముఖ్య పట్టణాల్లో ఎక్కువగా స్విగ్గీ, జొమోటో వంటి డోర్ డెలివరీలకు నెలవారీ అద్దె ప్రాతిపదికన ఉపయోగిస్తున్నారు. నగరంలోని శివార్లలో ఉండే కళాశాలలకు, ఇతర అవసరాలకు వెళ్లాలంటే ఆటోలే దిక్కు. దీంతో అనేకమంది చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రి సమయాల్లో అమ్మాయిలకైతే మరీ సమస్యగా ఉంటోంది. పోనీ చిన్నపాటి బైక్ ఏదైనా కొందామంటే ఖర్చుతో కూడుకున్న పని. వీటన్నింటికీ స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ ఈ-బైక్‌ల ద్వారా పరిష్కారం చూపిస్తోంది.

బైక్‌ల ట్రయల్ లాంచ్

కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ అద్దె ప్రాతిపదికన ఈ బైక్ సేవను ప్లాన్ చేసింది. ముందుగా ప్రజల అభిప్రాయాలను సేకరించేందుకు ట్రయల్ రన్ నిర్వహిస్తున్నారు. ఫీడ్ బ్యాక్ ఆధారంగా ఈ సేవలు నగరవ్యాప్తంగా అమలు చేయడానికి సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే ప్రజాభిప్రాయ సేకరణ పూర్తి కాగా నగరంలో సెంటర్లు ఏర్పాటు చేయనున్నారు. దీనికిగాను నిర్వాహకులనుంచి టెండర్లు పిలిచి కొత్త సంవత్సరంలో ఈ-బైక్‌లు అందుబాటులోకి తీసుకురానున్నారు.

ధ్రువపత్రాలు అవసరం

వాహనం కావాలనుకున్న వారు అధికారులు ఏర్పాటు చేసిన ఆయా సెంటర్లలో ఈ-బైక్‌లను అద్దెకు ఇచ్చే ముందు ఒరిజినల్ డ్రైవింగ్ లైసెన్సు, ప్రభుత్వం జారీ చేసిన పాన్ కార్డు, ఓటర్ కార్డు, ఆధార్ వంటివి ఇవ్వాల్సి ఉంటుంది.

నగరంలో పదిచోట్ల సెంటర్లు

కాకినాడ నగరంలో పదిచోట్ల సెంటర్లు ఏర్పాటు చేయనున్నారు. రైల్వేస్టేషన్, జీజీహెచ్, ఆర్టీసీ కాంప్లెక్స్, భానుగుడి సెంటర్, సర్పవరం జంక్షన్, జగన్నాథపురం, ప్రతాప్‌నగర్ బ్రిడ్జి, ఎన్టీఆర్ బీచ్, ఎస్ఆర్ఎంటీ మాల్, డీమార్ట్ జంక్షన్లలో ఈబైక్‌ల సెంటర్లు ఏర్పాటుకు చేసేందుకు అధికారులు సిద్ధం చేస్తున్నారు.



పట్టభద్రుల నియోజకవర్గానికి 3,15,261 మంది ఓటర్లు

● కాకినాడజిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు

కలెక్టరేట్(కాకినాడ), డిసెంబరు30 (ఆంధ్రజ్యోతి): తూర్పు పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గంలో 3,15,261 మంది ఓటర్లు ఓటు నమోదు చేసుకున్నట్లు తూర్పు పశ్చిమగోదావరి పట్టభద్రుల నియోజకవర్గం ఓటు నమోదు అధికారి, కాకినాడజిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు తెలిపారు. సోమవారం ఓటర్లజాబితా తుది ప్రచురణ చేశామన్నారు. దీన్ని అల్లూరి సీతారామరాజుజిల్లా, డాక్టరు బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా, తూర్పుగోదావరి జిల్లా, ఏలూరు జిల్లా, కాకినాడ జిల్లా, పశ్చిమగోదావరి జిల్లాల్లో కలెక్టరేట్‌ల్లో ప్రదర్శన నిమిత్తం ఉంచామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో, ఆర్డీవో కార్యాలయాల్లో కూడా ప్రదర్శించామన్నారు. మొత్తం ఓటర్లు 3,15,261 మంది కాగా దీనిలో అల్లూరి సీతారామరాజు జిల్లాలో 4664, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 64,327, తూర్పుగోదావరి జిల్లాలో 63,441, ఏలూరు జిల్లాలో 42,602, కాకినాడ జిల్లాలో 70,343, పశ్చిమగోదావరి జిల్లాలో 69,884 మంది ఓటర్లు ఉన్నారన్నారు.

రమణ మహర్షి బోధనలు అనుసరణీయం

రాచపల్లిలో ఘనంగా రమణమహర్షి 145వ జయంతి



రమణ మహర్షికి పూజలు చేస్తున్న భక్తులు



ప్రసంగిస్తున్న వాసుదేవానంద గిరిస్వామి, పాల్గొన్న భక్తులు

ప్రత్తిపాడు, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి):కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం రాచపల్లి గ్రామంలో రమణ మహర్షి 145వ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. రాచపల్లి రమణ ఆశ్రమంలో రమణ సేవాశ్రమ నిర్వాహకులు రమణానంద స్వామిజీ ఆధ్వర్యంలో రమణమహర్షివిగ్రహానికి భక్తులు పూజలు నిర్వహించారు. తొలుత ప్రణవ పతాకాన్ని వాసుదేవానందగిరి స్వామి ఆవిష్కరించారు. జ్యోతి ప్రజ్వలనను వత్సవాయి సుబ్బరాజు,దంతులూరి రామచంద్రరాజు, సుభద్రమమ్మలు చేయగా అక్షర మణిమాల ఉపదేశ పారాయణాన్ని సిరిపురం రమణ సత్సాంగ నిర్వాహకులు నిర్వహించారు. గోమాత పూజను మదినే శ్రీనివాసరావు-భద్రలక్ష్మి, మాణిక్యాలరావు-లక్ష్మీతులసి నిర్వహించగా భగవాన్ రమణమహర్షి అష్టోత్తర శత నామ అర్చనను, శ్రీ సారాయాగాన్ని బ్రహ్మశ్రీ ఆకుండి కృష్ణ ప్రకాష్‌శర్మ నిర్వహించారు. పుష్ప మాలాంకరణ,తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ఆలయ ప్రముఖులు బుద్దరాజు చంటిరాజు, రామలక్ష్మి, అన్నవరం దేవస్థానంమాజీ పాలక మండలి సభ్యులు బుద్దరాజు గోపిరాజు, వైస్ ఎంపీపీ బొంకు శ్రీను, మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు, మినర్వా విద్యాసంస్థల అధినేత డీవీఎస్ రమేష్ రాజులు నిర్వహించారు.

'రమణతత్వంతోనే మానసిక ప్రశాంతత'

రమణతత్వంతోనే మానసిక ప్రశాంతత కలిగి సమాజానికి మేలు చేకూరుతుందని శ్రీ విద్యా పీఠం పీఠాధిపతి వాసుదేవానందగిరి స్వామి అన్నారు. రమణ మహర్షిజయంతి సభకు రామానందస్వామి అధ్యక్షత వహించగా వాసుదేవానంద గిరి స్వామి మాట్లాడుతూ రమణ మహర్షి బోధనలు ఆచరణదాయకమన్నారు. ఈ ఆధ్యాత్మిక సభలో ఇంకా కాకినాడ ఆదిగురు యోగాపీఠాధిపతి సత్‌గురుసత్యానంద యోగి, శాంతి ఆశ్రమం మాతాజీ వినంభ్రనంద సరస్వతి, వంగలపూడి సద్గురు సేవా శ్రమ పీఠాధిపతి నిర్విశేషానంద మా తాజీ, లలిత గీతాశ్రమ పీఠాధిపతి విజ్ఞానందగిరి మాతాజీ ముఖ్యఅతిథులుగా హాజరై భక్తులను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం భారీ ఎత్తున్న అన్న సంతర్పణ నిర్వహించారు.



నూతన సంవత్సర వేడుకలకు పూలబొకేలు సిద్ధం





కడియం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): పూలకు నిలయమైన కడియపులంక, కడియపుసావరం, కడియం గ్రామాల్లో పూలడెకరేటర్లు గత కొద్దిరోజుల నుంచి పూలబొక్కేల తయారీలో బిజీబిజీగా ఉన్నారు. పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ, నూతన సంవత్సరాన్ని స్వాగతిస్తూ ప్రతీఒక్కరూ పూలబొక్కేలు ఇచ్చి 'హేపీ న్యూఇయర్' అంటూ శుభాకాంక్షలు చెప్పడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో ప్రధానంగా కడియపులంక అంతరాష్ట్ర పూలమార్కెట్, కడియం, కడియపుసావరం, బుర్రిలంక గ్రామాలకు చెందిన పూల వ్యాపారులు పూలబొక్కేలను తయారు చేస్తుంటారు. కొంత మంది పూలబొక్కేలను ముందుగా ఆర్డరు ఇచ్చి తయారు చేయమని చెబుతుంటారు. అలా తయారుచేసిన పూలబొక్కేలను ఆయా ప్రాంతాలకు పంపిస్తుంటారు. జర్బెరా, ఆర్కిడ్స్, స్నోబాల్, కార్నిషన్, గ్లాడియేటర్,డచీరోజెస్, క్రిసాంతిమం పూలను బెంగుళూరు, ఊటీ తదితర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకున్న పూలతో వేల విలువచేసే బొకేలు తయారు చేస్తుంటారు.

2న అండర్-12 బాలుర ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక

కాకినాడ అర్బన్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): క్రికెట్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లాశాఖ ఆధ్వర్యంలో జనవరి 2న ఉమ్మడి జిల్లా అండర్-12 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక కాకినాడ ఆర్ఎంసీ క్రికెట్ మైదానంలో నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పీఎస్ సత్యనారాయణ తెలిపారు. హాజరయ్యే బాలురు 2012, సెప్టెంబరు 1నుంచి 2015, ఆగస్టు 31లోపు జన్మించినవారై ఉండాలన్నారు. హాజరయ్యేవారు తెల్లని వస్త్రాలు, బూట్లు ధరించి రావాలన్నారు.



మార్కెట్లో రంగుల అమ్మకాలు

అనపర్తి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : నూతన సంవత్సర వేడుకల నుంచి సంక్రాతి వరకు పల్లె లోగిళ్ల రంగుల రంగుల రంగవల్లులతో మెరవాల్సిందే. నూతన సంవత్సరాన్ని స్వాగతిస్తూ అతివలు తమ ఇంటి వాకిట్లో నూతన సంంత్సరానికి స్వాగతం పలుకుతూ రంగు రంగుల రంగవల్లులతో స్వాగతం పలికేందుకు మహిళలు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే నూతన సంవత్సరానికి స్వాగతం పలికేందుకు వేయాల్సిన రంగవల్లుల నుండి బోగి, మకర సంక్రాంతి, కనుమ పండుగలవరకు ఏరోజు ఏరంగవల్లిని వే యాలో అతివలు పేపర్లపై ఇప్పటికే సిద్ధం చేసుకున్నారు. మంగళవారం అర్ధరాత్రికి పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఇంటి ముంగిళ్లలో రంగులు వేసేందుకు ఇప్పటికే మహిళలు రంగులు కొనుగోలులో బిజీ బిజీగా ఉన్నారు. దీనితో పలువురు వ్యాపారులు తోపుడు బళ్ళపై అమ్మకాలు సాగిస్తున్నారు. అనపర్తిమార్కెట్లో సుమారు 15 వరకు తోపుడు బండ్ల దుకాణాలు వెలవగా వీధుల్లో మరో పది పదిహేను తోపుడు బండ్ల వర్తకులు వ్యాపారం సాగిస్తున్నారు. దుకాణాలు పెరిగిపోవడంతో ఆశించినమేర బేరాలు జరగడం లేదని చిల్లర వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

శబ్దకాలుష్యాన్ని సృష్టిస్తున్న 502 బైక్ సైలెన్సర్లు ధ్వంసం

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ డీఎస్పీ ఎం.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో 502బైక్ సైలెన్సర్లు ధ్వంసం చేశారు. స్థానిక జాంపేట పోలీస్ ఫంక్షన్ హాలు వెలుపుల సోమవారం బైక్ సైలెన్సర్లను రోడ్డుపై వేసి రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. ట్రాఫిక్ సీఐలు నబీ, సూరిబాబులు, ట్రాఫిక్ ఎస్ఐలు సిబ్బంది కలిసి జిల్లా అంతటా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి అధికశబ్దం కలిగిన సైలెన్సర్లను బైక్ నుంచి తీయించి ధ్వంసం చేశారు. ఎస్పీ నరసింహకిషోర్ మాట్లాడుతూ ఈ స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందని, సైలెన్సర్లు విక్రయించే షాపులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



బైక్ సైలెన్సర్లను రోలర్‌తో తొక్కించి ధ్వంసం చేస్తున్న పోలీసులు

సత్యదేవుడి హుండీల ఆదాయం
రూ.1.52 కోట్లు



హుండీలలో భక్తులు సమర్పించిన కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది

అన్నవరం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): వివిధ ప్రాంతాల నుంచి అన్నవరం సత్యదేవుడి సన్నిధికి విచ్చేసిన భక్తులు హుండీలలో సమర్పించిన కానుకలను సోమవారం లెక్కించగా రూ.1,52,58,438 నగదు, 16.8 గ్రాముల బంగారం, 745 గ్రాముల వెండి సమకూరాయి. వీటితో పాటుగా యూఎస్‌ఏకు చెందిన 1901 డాలర్లు, మలేషియా 105, సౌదీఅరేబియా 1230, మరికొన్ని విదేశీ కరెన్సీ లభ్యమయ్యాయి. లెక్కింపును ఈవో సుబ్బారావు, ఛైర్మన్ రోహిత్‌లు పర్యవేక్షించగా సిబ్బంది లెక్కించారు. 28రోజులకు ఈ ఆదాయం సమకూరగా సరాసరిన రోజుకు భక్తులు రూ.5.44 లక్షలు కానుకల రూపంలో హుండీలలో వేసినట్టు ఈవో సుబ్బారావు తెలిపారు.

బంధువే.. బలి తీసుకున్నాడు

బాలుడిని నరికి చంపిన కిరాతకుడు
మద్దిమడుగు గ్రామంలో ఘటన



రక్తపు మడుగులో మృతిచెందిన బాలుడు

ఎటపాక, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం లక్ష్మీపురం పంచాయతీలోని ఆదివాసీ గ్రామమైన మద్దిమడుగులో సోమవారం సాయంత్రం ఓ బాలుడిని సమీప బంధువు గొడ్డలితో నరికి చంపాడు. తెలంగాణ రాష్ట్ర భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం కోయనరసాపురానికి చెందిన ముర్రం కోటేశ్ తన బంధువైన కణితి నాగరాజు(4)ని పత్తి చేను వద్ద గొడ్డలితో నరికి చంపాడు. ఇది చూసిన మరో బాలుడు గ్రామంలో చెప్పడంతో విషయం వెలుగుచూసింది. కాగా హంతకుడు, హత్యకు గురైన బాలుడు కోయనరసాపురానికి చెందినవారే. కొన్నేళ్ల క్రితం కోటేశు, నాగరాజు తండ్రి కుటుంబాలు పోడు వ్యవసాయం కోసం మద్దిమడుగు ప్రాంతానికి వలసవెళ్లారు. 2 కుటుంబాల మధ్య అప్పుడప్పుడూ గొడవలు జరగడం, పెద్ద మనుషులు కలుగజేసుకుని రాజీ చేయడం జరిగేవని తెలుస్తోంది. కాగా కోటేశ్ మానసిక స్థితి సరిగ్గా లేక హత్యకు పాల్పడినట్టు తెలుస్తోంది. సంఘటనాస్థలానికి పోలీసులు చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. కోటేశ్ పరారైనట్టు సమాచారం.

రంప ఏరియా ఆసుపత్రిలో గర్భిణి మృతి

విచారణకు ఆదేశించిన ఐటీడీఏ పీవో



మృతురాలు తెల్లం లక్ష్మి

రంపచోడవరం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో నిండు గర్భిణి మృతి చెందింది. మండలంలోని ఆకూరు పంచాయతీ కొయ్యలగూడెం గ్రామానికి చెందిన తెల్లం లక్ష్మిని ప్రసవం కోసం ఆమె భర్త వెంకన్నదొర శుక్రవారం రంప ఏరియా ఆసుపత్రికి తీసుకొచ్చాడు. శనివారం ఆమె పుట్టినరోజు కావడంతో ఇంటికి తీసుకెళ్లి మళ్లీ పురిటి నొప్పులు రావడంతో రాత్రి ఆసుపత్రికి తీసుకొచ్చాడు. ఆదివారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో అధికంగా రక్తస్రావ మైంది. ఆ సమయంలో ఇద్దరు గైనకాలజిస్టు లూ లేరు. డ్యూటీలో ఉన్న చిన్న పిల్లల డాక్టర్ ఆది లక్ష్మి వైద్యం అందించేలోపే లక్ష్మి మృతి చెందింది. వైద్యుల నిర్లక్ష్యంతోనే ఇలాజరిగిందని భర్త వెంకన్నదొర ఆరోపించాడు. సమయానికి వైద్యం అందించి ఉంటే తల్లి, బిడ్డ బతికి ఉండేవారని, పూర్తి స్థాయిలో దర్యాప్తు జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాడు. కాగా గర్భిణి మృతిపై విచారణ అధికారిగా సబ్ కలెక్టర్ కేఆర్ కల్పశ్రీని నియమించినట్టు ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. సోమవారం ఆయన సబ్ కలెక్టర్‌తో కలిసి ఆసుపత్రిని సందర్శించి బాధిత కుటుంబ సభ్యులు, వైద్యాధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో వైద్యుల కొరత ఉందని, గైనకాలజిస్టు నిత్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు.

5 కిలోల గంజాయితో ఇద్దరి అరెస్ట్

కరప, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): కరప మండలం నడకుదురులో సోమవారం పోలీసులు ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి 5 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ తోట సునీత తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. నడకుదురులో గంజాయి రవాణా జరుగుతున్నట్టు సమాచారం అందడంతో పోలీసులు రంగప్రవేశం చేశారు. నడకుదురు పూర్ణ ఫంక్షన్‌హాల్ వెనుక అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులది ఒడిస్సా రాష్ట్రం మల్కాన్గిరి జిల్లా కోరుకొండ మండలం గుంటవాడ గ్రామానికి చెందిన కీల్లో శ్రీను, అల్లూరి సీతారామరాజు జిల్లాలో మండల కేంద్రం దుంబ్రీగూడ గ్రామానికి చెందిన గల్లేళ్ల రమేష్ అలియాస్ విష్ణుగా గుర్తించారు. ఒడిస్సా రాష్ట్రం నుంచి కర్నాటక రాష్ట్రంలోని బెంగుళూరుకు గంజాయిని తరలిస్తున్నట్టు విచారణలో తేలింది. నిందితుల నుంచి 3 ప్యాకెట్లలో ఉన్న రూ.25వేలు విలువచేసే గంజాయిని స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్‌కు తరలించినట్టు ఎస్‌ఐ తెలిపారు. ఏఎస్‌ఐ సూరిబాబు, డిప్యూటీ తహశీల్దార్ దుర్గాప్రసాద్, వీఆర్వోలు కుంపట్ల గణపతి, చాగంటి వరుణ్, పోలీసులు పాల్గొన్నారు.

350 గ్రాముల బంగారం, రూ.2లక్షలు చోరీ

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ మండల పరిధిలోని బొమ్మూరు బాలాజీపేట సమీపంలోని రామకృష్ణనగర్‌లో ఒక ఇంట్లో దొంగలు పడ్డారు. బొమ్మూరు పోలీసుల వివరాల ప్రకారం... రామకృష్ణనగర్‌కు చెందిన గరగ అనంతలక్ష్మి జిల్లా కలెక్టర్ కార్యాయలంలో కోఆర్డినేషన్ సూపరింటిండెంట్‌గా పనిచేస్తున్నారు. ఈనెల 26న కాకినాడలో బంధువులు మరణించడంలో కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళాలు వేసుకుని ఊరు వెళ్లారు. తిరిగి ఈనెల 29 రాత్రి రామకృష్ణ నగర్ చేరుకున్నారు. ఇంటి తాళలతో పాటు బీరువా డోరు పగులు కొట్టి ఉంది. బీరువాలో 350 గ్రాముల బంగారు వస్తువులు, రూ.2లక్షలు నగదు కనిపించకపోవండంతో బాధితురాలు బొమ్మూరు పోలీసులు పిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బీ కే(ర్)క్!



- రంగురంగుల కేక్‌లు.. అనారోగ్య కారకాలు
- కృత్రిమ రంగులు కలిపి విచ్చలవిడిగా విక్రయాలు
- తూతూమంత్రంగా ఆహార భద్రత అధికారుల తనిఖీలు

పెద్దాపురం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కేక్ ట్రెండ్ నడుస్తోంది. పండగైనా, పుట్టినరోజైనా, పెళ్లయినా, వార్షికోత్సవమైన, విజయోత్సవమైనా ఏదైనా వస్తువ, వాహనం, యంత్రం కొనుగోలు చేసినా మొదట కేక్ కట్ చేయడం ఆనవాయితీగా మారింది. ఈ పరిస్థితుల్లో వినియోగదారులను ఆకర్షించేందుకు ఆహార పదార్థాల్లో కృత్రిమ రంగులను కలపడం కూడా ఇటీవల అధికమయ్యింది. వాటిని తింటే మధుమేహం, బీపీతో పాటు ప్రాణాంతక వ్యాధుల బారినపడే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. కల్తీ ప్రమాదకర ఆహారం నుంచి ప్రజలను రక్షించడానికి ఎన్నో చట్టాలు ఉన్నాయి. అధికారులు మాత్రం వాటిని అమలుచేయట్లేదు. కొంతమంది వ్యాపారుల స్వార్థం, మరికొంతమందికి అవగాహన లేక కృత్రిమ రంగులు కలిపిన ఆహార పదార్థాలను తయారుచేసి విక్రయిస్తున్నారు. తద్వారా ప్రజలా ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. కేక్‌లలో రంగులు అధికంగా కలుపుతున్నట్టు తెలుస్తోంది.

నిబంధనల అమలు అంతంతే...

స్వీటు షాపు నిర్వాహకులు ఎక్కువమంది ఫుడ్ లైసెన్స్ తీసుకోకుండా చాటుమటున అమ్మకాలు చేస్తుంటారు. కేక్‌లు, స్వీట్లు కవర్లు బాక్సులపై వాటి తయారు తేదీ కచ్చితంగా ముద్రించాలి. స్వీట్లు తయారీలో తప్పనిసరిగా సరి చూసుకోవాలి. చాలా చోట్ల కేక్‌లు, స్వీట్లు తయారీలో అనుమతులు లేని రంగుల వాడుతున్నట్టు తెలుస్తోంది. ఆహార భద్రతాధికారులు తూతూమంత్రంగా దాడులు చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. గడచిన ఏడాదికాలంలో ఆహార భద్రతా అధికారులకు పిర్యాదులు చేశామని కానీ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవని పలువురు చెబుతున్నారు.



అద్దాల మేడల్లో అందమైన విషం..

ఇటీవల కార్పోరేట్ స్థాయిలో అద్దాల మేడలుగా ఏర్పాటు చేసి అందులో రంగురంగుల కేక్‌లు నిల్వ ఉంచుతున్నారు. కొన్నాళ్ల క్రితం వరకూ స్థానికులు బేకరీలు నిర్వహించేవారు. కొంతమంది కార్పోరేట్ స్థాయిలో పట్టణాల్లో భారీ ఎత్తున బేకరీలు ఏర్పాటు చేసి అద్దాల నీడలో కేక్‌లను ఉంచుతూ వినియోగదారులను ఆకర్షిస్తున్నారు. అక్కడ చూస్తే ఎవరికైనా కేక్ కొనాలనిపిస్తుంది. వాటిలో వారం పదిరోజులుగా నిల్వ ఉంచినవి కూడా ఉంటున్నాయని జనం వాపోతున్నారు. ప్రజలకు తెలియకుండా అనారోగ్యాన్ని కొనితెచ్చుకుంటున్నారని వైద్యులు సైతం చెబుతున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో స్వీట్లు, కేక్‌లు తయారుచేసే షాపులు వందల్లో ఉన్నాయి. వీటి ద్వారా నిత్యం రూ.లక్షలాది వ్యాపారం సాగుతోంది. కొన్నిరకాల బ్రాండ్ల పేరుతో ఉన్న షాపుల్లో ఇతర ప్రాంతాల నుంచి స్వీట్లు దిగుమతి చేసుకుని విక్రయిస్తుంటారు. కేక్‌లు, స్వీట్లు కొనుగోలు చేసే సమయంలో జాగ్రత్త వహించాలి. లేదంటే అనారోగ్యం బారినపడక తప్పదు.



బూరుగుపూడిలో రేవ్ పార్టీ

ఒక ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు
13 మంది యువకులు, ఐదుగురు యువతుల అరెస్టు



బూరుగుపూడి నాగసాయి ఫంక్షన్ హాల్లో వివరాలు వెల్లడిస్తున్న సీఐ సత్యకిషోర్

కోరుకొండ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న రేవ్ పార్టీపై పోలీసులు దాడి చేసి 18 మందిని అదుపులోకి తీసుకున్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం నియోజకవర్గం కోరుకొండ పోలీస్‌స్టేషన్‌లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సత్యకిషోర్ సోమవారం మధ్యాహ్నం వివరాలను వెల్లడించారు. ఈ నెల 27న గుజరాత్ మైక్రో న్యూట్రీషియన్ కంపెనీకి చెందిన సేల్స్ ఎగ్జిక్యూటివ్ గోపాలకృష్ణ రూ.18 వేలకు కోరుకొండ మండలం బూరుగుపూడి జంక్షన్ వద్ద ఉన్న ఏబీఆర్ ఇన్‌ఫ్రా నాగసాయిరాం ఫంక్షన్ హాల్ బుక్ చేసి ఆదివారం అర్ధరాత్రి రేవ్ పార్టీ ఏర్పాటు చేశారు. ఇక్కడికి పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు, తణుకు, ఆచంట తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం, ధవళేశ్వరం ప్రాంతాలకు చెందిన 10 మంది ఎరువుల డీలర్లను రప్పించారు. గోపాలకృష్ణకు పరిచయం ఉన్న కాకినాడకు చెందిన అను అనే అమ్మాయి ద్వారా ముగ్గురు యువతులను రంపచోడవరం, ధవళేశ్వరం ప్రాంతాల నుంచి ఇద్దరు మొత్తం ఐదుగురు యువతులను ఆదివారం రాత్రి ఫంక్షన్ హాల్‌కు రప్పించారు. ఫంక్షన్ హాలులో రూ.15 వేలకు 5 రూమ్‌లు బుక్ చేశారు. వారందరూ మద్యం తాగుతూ అమ్మాయిలతో డ్యాన్స్‌లు చేస్తూ ఎంజాయ్ చేస్తున్న సమయంలో తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్‌కి వచ్చిన సమాచారం మేరకు స్పెషల్ పోలీస్, లోకల్ పోలీసులు ఫంక్షన్ హాల్‌పై రైడ్ చేశారు. అక్కడ ఉన్న 13 మంది యువకులు, ఐదుగురు యువతులను అదుపులోకి తీసుకున్నట్టు సీఐ తెలిపారు. యువతులను వైద్య పరీక్షల నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించామన్నారు. ఫంక్షన్ హాల్ యజమాని సత్తి భామిరెడ్డి పరారీలో ఉండడంతో కుమారుడు రామిరెడ్డి, వివిధ ప్రాంతాల నుంచి యువతులను తీసుకొచ్చిన ట్యాక్సీ డ్రైవర్, సూత్రధారుడైన గోపాలకృష్ణ, 10 మంది ఎరువుల డీలర్లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసుకున్న సౌండ్ సిస్టమ్, రూ.61 వేలు నగదు, గోపాలకృష్ణ సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నామన్నారు. మరో ఇద్దరు యువతులను రూమ్‌ల్లో పట్టుకున్నామన్నారు. కేసు లోతుగా విచారణ జరుగుతుందన్నారు. సమావేశంలో కోరుకొండ ఇన్‌చార్జ్ ఎస్‌ఐ ఎండీ అశ్వాక్ ఉన్నారు.

నిర్వాహకులను అరెస్టు చేశాం : ఎస్పీ

రాజమహేంద్రవరం సిటీ, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): బూరుగుపూడి జంక్షన్ వద్ద నిర్వహించింది రేవ్ పార్టీ కాదని అక్కడ మహిళలతో కొంత మంది పార్టీ చేసుకుంటున్నట్టు తెలిసి దాడి చేసి నిర్వాహకులతో పాటు 13 మందిని అరెస్టు చేశామని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అసభ్యకరంగా పార్టీలు నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఆక్వా రైతులకు నాబార్డు రుణాలు

గోదావరి జిల్లాల ఆక్వా ప్రాంతీయ సదస్సులో నాబార్డు, మత్స్యశాఖ అధికారులు



సదస్సులో మాట్లాడుతున్న నాబార్డు సీజీఎం

రాజమహేంద్రవరం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆక్వా రంగంలో చిన్న, మధ్యతరగతి రైతులతోపాటు కార్పొరేట్ రంగానికి నాబార్డు రుణాలు ఇస్తున్నట్టు నాబార్డు సీజీఎం ఎం.ఆర్. గోపాల్ తెలిపారు. రాజమహేంద్రవరంలోని లాహస్పిన్‌లో సోమవారం మత్స్యశాఖ, నాబార్డు ఆధ్వర్యంలో జరిగిన గోదావరి జిల్లాల ఆక్వా రైతుల ప్రాంతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. చేపలు, రొయ్యల సాగు చేస్తున్న రైతులకు నాబార్డు ఆసరాగా ఉందన్నారు. భారతదేశంలో రొయ్యల పెంపకం, ప్రాసెసింగ్, ఎగుమతి రంగాలకు సంబంధించి నాబార్డు రుణాలు ఇవ్వడానికి వ్యూహ రచన చేస్తున్నట్టు చెప్పారు. దేశంలో 70 శాతం ఆక్వా, మత్స్య ఉత్పత్తి ఆంధ్రప్రదేశ్‌లో ఉందన్నారు. రాష్ట్రంలో 974 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉండడం వల్ల ఫిషరీస్ ఎగుమతుల్లో రికార్డుస్థాయి వృద్ధి నమోదైందన్నారు. ప్రతి కుటుంబం నుంచి వ్యాపారవేత్తలు తయారీ లక్ష్యంతో సీఎం చంద్రబాబు స్వర్ణాంధ్ర2047లో భాగంగా పనిచేస్తున్నామన్నారు. మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ లాల్ మహ్మద్ మాట్లాడుతూ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలోనే 70 శాతం ఆక్వా కల్చర్ సాగు ఉందన్నారు. 540 34 మంది రైతులకు విద్యుత్ రాయితీలు అందిస్తున్నట్టు చెప్పారు. సదస్సులో నాబార్డు సీజీఎం డా.ఏ.వి. భవానీ శంకర్, ఎస్ఎల్‌బీసీ ఏజీఎం శ్రీనివాసదాస్యం, ఏజీఎం ఎస్ఎల్‌బిసి శ్రీనివాస్, డా.ఏపీ. మాధురి, ఐసీఏఆర్ -సీఎం ఎఫ్ఆర్ఐ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డా.జెకె. కిజాకుడన్, ఎంపీఈడీఏ జాయింట్ డైరెక్టర్ విజయకుమార్ ఎరగల్ పాల్గొన్నారు.

గోదావరిలో పడి...

యువకుడి గల్లంతు
బయటపడిన మరో యవకుడు



బయటపడిన స్టీఫెన్

ముమ్మిడివరం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ము రమళ -పల్లంకుర్రు ఏటిగట్టు రోడ్డులో మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులు అదుపు తప్పి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం అయినాపురం అవుట్‌ఫాల్ స్లూయిజ్ వద్ద గోదావరి పాయలో పడ్డారు. ఒక యువకుడు గల్లంతు కాగా మరో యువకుడు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఉప్పలగుప్తం మండలానికి చెందిన పెయ్యల స్టీఫెన్, దోనిపాటి అభిషేక్ సోమవారం రాత్రి యానాం వెళ్లి తమ స్వగ్రామానికి తిరిగివస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. అభిషేక్ మోటార్‌సైకిల్ నడుపుతుండగా స్టీఫెన్ వెనుక కూర్చున్నాడు. అయినాపురం అవుట్‌ఫాల్ స్లూయిజ్ వద్ద మోటార్ సైకిల్ చెట్టును ఢీకొనడంతో అభిషేక్ గోదావరి పాయలో పడి గల్లంతయ్యాడు. స్టీఫెన్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. అభిషేక్ కోసం పోలీసులు, స్థానికులు గాలింపు చేపట్టారు.

'న్యాయవాదులపై పోలీసుల దురుసు ప్రవర్తన తగదు'

పిఠాపురం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): న్యాయవాదులపై పోలీసుల దురుసు ప్రవర్తన తగదని ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.ధర్మారెడ్డి, జీఎస్ భాస్కరాచార్యులు అన్నారు. అనంతపురం జిల్లా త్రీటౌన్ పోలీసుస్టేషన్‌లో తమ పరిధిని దాటి సివిల్ వివాదంలో జోక్యం చేసుకుని న్యాయవాది శేషాద్రి పట్ల దురుసుగా ప్రవర్తించి అతడి మరణానికి కారణమయ్యారని తెలిపారు. న్యాయవాదులపై పోలీసుల దౌర్జన్యాలపై సీఎం చంద్రబాబు, హోంమంత్రి అనితలు స్పందించి తక్షణం విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



లాంగ్ జంప్ చేస్తున్న అభ్యర్థి

కానిస్టేబుల్ అభ్యర్థులకు
దేహదారుఢ్య పరీక్షలు ప్రారంభం

కాకినాడ క్రైం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): సివిల్, ఏపీఎస్పీ ఐఆర్ కానిస్టేబుళ్ల నియామక ఎంపిక ప్రక్రియలో భాగంగా అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు సోమవారం కాకినాడ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ప్రారంభమయ్యాయి. తొలిరోజు 273 మంది అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరుకాగా తదుపరి పరీక్షకు 163మంది అభ్యర్థులు అర్హత సాధించారు. ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు సోమవారం దేహదారుఢ్య పరీక్షలను నిర్వహించడం జరిగింది. ఈ పరీక్షలను కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ పర్యవేక్షించారు.



అభ్యర్థి ఎత్తు కొలుస్తున్న దృశ్యం

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

మానేపల్లి హైస్కూల్లో వక్కలంక రామారావు ప్రతిభా పురస్కారాల పంపిణీ



ప్రతిభా పురస్కారాలు అందుకుంటున్న విద్యార్థులు

పి.గన్నవరం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నైతిక విలువలతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని విశ్రాంత జిల్లా ఉపవిద్యా శాఖాధికారి మైలవరపు రవీంద్రనాథ్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం మానేపల్లి బాలుర జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం వక్కలంక రామారావు ప్రతిభా పురస్కారాలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమానికి ప్రధానోపాధ్యాయుడు కె.వెంకటసూర్యనారాయణమూర్తి అధ్యక్షత వహించగా రవీంద్రనాథ్ మాట్లాడారు. మానేపల్లి హైస్కూల్లో వక్కలంక రామారావు ఉపాధ్యాయుడిగా సుదీర్ఘకాలం పనిచేశారని, ఆయనకు ఈ ప్రాంతంతో విడదీయరాని బంధం ఉందన్నారు. ఆయనతో కలిసి పనిచేసిన అనుభవం నాకు కూడా ఉందని పాత జ్ఞాపకాలను విద్యార్థులతో పంచుకున్నారు. మానేపల్లి హైస్కూల్లో చదివిన పూర్వ విద్యార్థులు నేడు వివిధ రంగాల్లో, వివిధ హోదాల్లో పనిచేస్తున్నారన్నారు. విద్యార్థుల్లో పోటీతత్వం పెరిగి విద్యలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకే పాఠశాల పూర్వ విద్యార్థులైన రామారావు తనయులు గత ఎనిమిదేళ్లుగా ఈ ప్రతిభా పురస్కారాలు అందిస్తున్నారన్నారు. ఈ క్రమంలోనే ప్రతి ఏడాది ఏడో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఇద్దరు విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందిస్తున్నారని ఆయన చెప్పారు. అలాగే బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గాలిదేవర శ్రీనివాసరావు, బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.వి.సూర్యనారాయణమూర్తి మాట్లాడుతూ వక్కలంక రామారావు ప్రతిభా పురస్కారాలు ప్రతి ఏడాది విద్యార్థులకు ఆయన తనయులు అందించడం అభినందనీయమన్నారు. 2023-24 విద్యాసంవత్సరంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బాలుర పాఠశాల విద్యార్థి గోగు వెస్లేరాజు, బాలికల పాఠశాల విద్యార్థిని మోకా రక్షితకు రూ.5వేలు చొప్పున అందజేశారు. కార్యక్రమంలో హైస్కూలు చైర్మన్లు జోగి కుమారకృష్ణ, కొమ్ముల రమాదేవి, విద్యార్థుల తల్లిదండ్రులు గోగు దేవరాజు, మోకా సూర్యకుమారి పాల్గొన్నారు.

అమలాపురం

అంతర్జాతీయ వాకర్స్ ఉపాధ్యక్షుడిగా నాగేంద్ర

అమలాపురం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): వాకర్స్ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడిగా అమలాపురం పట్టణానికి చెందిన బీవీసీ కళాశాల ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెండు రోజుల క్రితం ఏలూరులో జరిగిన అంతర్జాతీయ వాకర్స్ కన్వెన్షన్ మీటింగ్‌లో నాగేంద్రను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

భర్త వివాహేతర సంబంధంపై భార్య ఫిర్యాదు

ఉప్పలగుప్తం, డిసెంబరు30(ఆంధ్రజ్యోతి): తన భర్త వివాహేతర సంబంధం పెట్టుకుని తనను వేధిస్తున్నాడంటూ ఉప్పలగుప్తం గ్రామానికి చెందిన దేవిశెట్టి సాయిరమాదేవి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. అత్త, మరిది వత్తాసు పలకడంతో తన పరిస్థితి దారుణంగా మారిందన్నారు. భర్త, అత్త, మరిదిలపై చర్యలు తీసుకోవాలని కోరింది.

జగ్గన్నతోట ప్రభల ఉత్సవ ఏర్పాట్లపై కలెక్టర్‌కు నివేదిక

- అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణ
- ఏసీకి సమస్యలు వివరించిన ఉత్సవ కమిటీ సభ్యులు


ప్రభల తీర్థం జరిగే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అసిస్టెంట్ కమిషనరు

అంబాజీపేట, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా కనుమ రోజున అంబాజీపేట మండలం మొసలపల్లి పరిధిలోని జగ్గన్నతోటలో నిర్వహించే ఏకాదశ రుద్రుల ఉత్సవంలో ఏర్పాట్లు, సమస్యలపై ఉత్సవ కమిటీ సూచనల మేరకు కలెక్టర్‌కు నివేదిక అందిస్తామని దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనరు వి.సత్యనారాయణ తెలిపారు. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశాలతో జగ్గన్నతోటలో తీర్థం జరిగే ప్రదేశాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏకాదశ రుద్రుల ప్రభల ఉత్సవంలో 11గ్రామాల నుంచి ప్రభలను ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రభలు జగ్గన్నతోటలో ఒకేచోట కొలువుతీరి భక్తులకు దర్శనం అందిస్తారన్నారు. ఈఉత్సవానికి దేశ, విదేశాల నుంచి సుమారు లక్షకు పైగా భక్తులు తీర్థానికి తరలివచ్చి స్వామివార్లను దర్శించుకుంటారని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారన్నారు. ఈతీర్థానికి సంబంధించి పలు సమస్యలను ఉత్సవ కమిటీ సభ్యులు దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌కు వివరించారు. ప్రభలను తీర్థానికి తీసుకువచ్చే రహదారుల్లో శానిటేషన్, తుప్పలు తొలగించాలని, తీర్థంలో బూరలు నిషేధించాలన్నారు. తీర్థానికి వచ్చే భక్తులకు తాగునీరు అందించాలని, ప్రభలు వచ్చే రహదారులల్లో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు ఎ జగ్గన్నతోట తీర్థానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని కోరారు. ఉత్సవ కమిటీ సభ్యులు సూచించిన సమస్యలు, కావాల్సిన సదుపాయాలపై జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందిస్తానని ఆయన తెలిపారు. దేవదాయ శాఖాధికారి బి.వెంకటేశ్వరరావు, స్థానికులు పాల్గొన్నారు.

అమిత్‌షాను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలి

- వామపక్షాలు, దళిత ప్రజాసంఘాలు, సీపీఎం, కేవీపీఎస్ నాయకుల ఆందోళన


అమలాపురం: కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న కేవీపీఎస్, వామపక్ష నాయకులు

అమలాపురం టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవహేళన చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను తక్షణం మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండు చేస్తూ వామపక్షాలు, దళిత ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని రద్దు చేయాలనే ఆలోచనతోనే అంబేడ్కర్‌ను అవమానిస్తుందని నాయకులు ధ్వజమెత్తారు. కలెక్టర్ మహేష్‌కుమార్‌కు అర్జీ అందించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, దళిత ఐక్యవేదిక కన్వీనర్ జంగా బాబూరావు, కార్యదర్శి ఇసుకపట్ల రఘుబాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి కొప్పుల సత్తిబాబు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పొలమూరి మోహన్‌బాబు, గెడ్డం సురేష్‌బాబు, ఐద్వా జిల్లా కార్యదర్శి టి.నాగవరలక్ష్మి, శెట్టిబత్తుల తులసీరావు, గోగి మురళి, మోకా శ్రీను, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరంలో నిరసన

ముమ్మిడివరం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షాను తక్షణం మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్‌చేస్తూ ముమ్మిడివరంలో సోమవారం సీపీఎం, కేవీపీఎస్ నాయకులు నిరసన చేపట్టారు. స్థానిక బళ్లగేటు సెంటర్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు గుదే దుర్గాప్రసాద్, మండల కార్యదర్శి సకిలే సూర్యనారాయణ, కేవీపీఎస్ నాయకుడు యు.ప్రసాద్ మాట్లాడారు. బీజేపీ అనుసరిస్తున్న మతోన్మాద, కులోన్మాద విధానాలను నశించాలని వారు డిమాండ్ చేశారు. కేవీపీఎస్ నాయకులు ఎస్.వెంకటేష్, పాము బాలయ్య, దొమ్మేటి వీరరాఘవులు, అనుచూరి లక్ష్మణరావు, కె.సత్యనారాయణ, ముదే చినసత్యనారాయణ, కొప్పిశెట్టి గణేష్, రాయుడు వీర్రాజు పాల్గొన్నారు.

రైతుల ప్రయోజనాలు నీటిసంఘాల బాధ్యత


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ

మలికిపురం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): గత పాలకుల హయాంలో రాజోలు నియోజకవర్గం నిర్లక్ష్యానికి గురైందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. సోమవారం మలికిపురం ఎల్ఎస్ ల్యాండ్ మార్కు వద్ద జరిగిన సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ సమావేశంలో మాట్లాడుతూ 14వేల ఎకరాల ఆయకట్టు ఉంటే కేవలం 3400ఎకరాల ఆయకట్టుకు వ్యవసాయం దిగజారిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. నూతనంగా ఎన్నికైన నీటి సంఘాల నాయకులు బాధ్యతాయుతంగా పనిచేసి రైతులకు మేలు చేయాలని పిలుపునిచ్చారు. రాజోలు నియోజకవర్గంలో డ్రెయిన్లు, కాల్వల ఆధునికీకరణకు రూ.373కోట్ల వ్యయ అంచనాలతో సీఎం చంద్రబాబుకు నివేదికలు అందజేశానన్నారు. మన ప్రాంతానికి 2కోట్ల లీటర్ల నీరు అవసరం ఉంటే 60శాతం మాత్రమే వస్తుందన్నారు. సెంట్రల్ డెల్టా చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ మాట్లాడుతూ రాజోలు నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయడానికి అధికారులు, ఎమ్మెల్యే సహకారంతో ముందుకు వెళతామన్నారు. ఇరిగేషన్ ఈఈ నరసింహరావు, డీఈ నాగేంద్రకుమార్, హెడ్‌వర్క్స్ డీఈ శ్రీనివాస్, డ్రైనేజీ డీఈ నాగార్జున, డీసీ పినిశెట్టి బుజ్జి, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, చాగంటి స్వామి, నియోజకవర్గంలోని నీటి సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

వివేకానంద విద్యార్థులకు రాష్ట్రపతి అభినందనలు



మలికిపురం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురం వివేకానంద స్కూల్ విద్యార్థులు 1ఎం1బి జాతీయ యువమార్పు తయారీదారుల రాష్ట్రపతి సదస్సులో పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల యువతలో నైపుణ్యాల అభివృద్ధి కోసం, పర్యావరణ పరిరక్షణ, సుస్థిరాభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్న 1ఎం1బి సంస్థ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో 15మంది విద్యార్థులు ఎంపిక కాగా వారిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున వివేకానంద విద్యార్థినులు పెసల భువనసాధిక, నల్లి రోజలిన్ ఈ-వేస్ట్ ప్రాజెక్టుకు ఎంపికయ్యారు. రాష్ట్రపతి సమక్షంలో ఈ-వేస్ట్ ప్రాజెక్టు గురించి వీరిద్దరూ వివరించగా రాష్ట్రపతి ద్రౌపదిముర్ము అభినందించినట్టు ప్రిన్సిపాల్ పీవీవీ వరప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో 1ఎం1బి ఫౌండేషన్ ఫౌండర్ మానవసుబోధ్, ప్రాజెక్టు డైరెక్టర్లు దీపిక, గ్రాస్‌రూట్స్ ఇనిషియేటివ్ ప్రోగ్రాం డైరెక్టర్ అభిరామ్, సాగర్ తదితరులు పాల్గొన్నారని ఆయన అన్నారు. విద్యార్థులను వివేకానంద స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో అభినందించారు.

ముంపు ఇబ్బందులపై రైతుల రాస్తారోకో

అల్లవరం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): రామేశ్వరం మొగలో ఆక్రమణలు, డ్రైన్‌లో ముంపునీరు దిగక నేటికి దాళ్వా నారుమడులు వేయలేదనే ఆగ్రహంతో రైతులు అల్లవరంలో సోమవారం ధర్నా చేశారు. తహశీల్దారు కార్యాలయ పరిధిలో రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. నేటికీ పంట పొలాల్లో ముంపు నీరు దిగలేదని మేజర్, మైనర్ డ్రైన్లలో తూడు, గుర్రపుడెక్క తొలగించాలని, పలు డిమాండ్లతో రైతులు ఆందోళన చేపట్టారు. అధికారులు ముంపు సమస్య పరిష్కరించకుంటే ఆమరణ దీక్ష చేపడతానని రైతు నాయకుడు బి.శ్రీనివాస్ ప్రకటించారు. బి.శ్రీనివాస్, బి.నాగశివప్రసాద్, వెదుళ్లపల్లి సుబ్రహ్మణ్యం, పెన్మత్స సత్యనారాయణరాజు, బసవా వెంకటేశ్వరరావు, మొల్లేటి వీరభద్రం, పితాని సూర్యనారాయణ, పాటు రైతులు పాల్గొన్నారు. కలెక్టర్‌కు వినతిపత్రాన్ని సమర్పిస్తున్నట్లు తెలిపారు.

కులాల మధ్య చిచ్చురేపుతున్న ఉత్తర్వులను రద్దు చేయాలి


నిరసన తెలుపుతున్న బొబ్బర్లంక ఎస్సీ మత్స్యకారులు

అమలాపురం టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కులాల మధ్య చిచ్చురేపే విధంగా జిల్లా మత్స్యశాఖ అధికారి ఎన్.శ్రీనివాసరావు ఇచ్చిన ఉత్తర్వులను తక్షణం వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక జల్లివారిపేటకు చెందిన ఎస్సీ మత్స్యకారులు ఆందోళనకు దిగారు. ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కొండా దుర్గారావు, జిల్లాశాఖ అధ్యక్షుడు సరెళ్ల దాసు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. దశాబ్దాల కాలంగా ఎస్సీ మత్స్యకారులు ధవళేశ్వరం బ్యారేజీ దిగువన చేపల వేట, రొయ్యసీడు సేకరణ చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారని ఈర్ష్యపడ్డ మరో వర్గం వారు దాడులకు తెగబడడంతో గతంలో కేసులు నమోదు చేసి 50రోజుల పాటు గ్రామంలో పోలీసు పికెట్ నిర్వహించిన విషయాన్ని వివరించారు. తిరిగి మరోసారి మత్స్యశాఖ అధికారులు కులాల మధ్య చిచ్చురేపే విధంగా మత్స్యకారులకు రొయ్యసీడు సేకరణపై హక్కులు కల్పిస్తూ ఉత్తర్వులు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండించారు. బొబ్బర్లంక-ధవళేశ్వరం బ్యారేజీ గేట్లకు సరిహద్దులు నిర్ణయించాలని, జల్లివారిపేట ఎస్సీ మత్స్యకారుల హక్కులకు చట్టబద్ధత కల్పించాలని, ప్రస్తుతం నెలకొన్న ఆందోళనల నేపథ్యంలో పిచ్చుకలంకలో పోలీసు పికెట్ ఏర్పాటుచేయాలని నినాదాలు చేశారు. మత్స్యశాఖ అధికారులు ఇచ్చిన ఉత్తర్వులను తక్షణం రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్ మహేష్‌కుమార్‌కు అర్జీ అందించారు. ఆందోళనలో నాయకులు జల్లి డేవిడ్, గోళ్ల రామారావు, కె.సతీష్, యార్లగడ్డ సంజీవ్‌కుమార్, గోళ్ల మోహనరావు, జల్లి చక్రవర్తి, జల్లి వెంకటరమణ, జె.హేమసుందర్‌పాల్గొన్నారు.

హిందూ, ముస్లిం, క్రైస్తవుల అపూర్వ కలయిక

ముమ్మిడివరం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరంలో గౌస్ సెల్ పాయింట్ యజమాని గౌస్ బాషా ఆధ్వర్యంలో మండలంలోని సెల్ షాపు యజమానులు హిందూ, ముస్లిం, క్రైస్తవులు ఒక్కచోట వేదికయ్యారు. వారికి అమలాపురానికి చెందిన ముస్లిం మత గురువు అల్తాఫ్, సనాతన ధర్మం గురించి వివరించారు. మండలంలోని మొబైల్ షాపుల యజమానులంతా పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ కోరుతూ చిత్రాలు

మామిడికుదురు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోరుతూ ఈదరాడ హైస్కూలు విద్యార్థులు పోస్టుకార్డులపై గీసిన చిత్రాలు ఆకట్టుకున్నాయి. 7,8,9 తరగతుల విద్యార్థులు పోస్టుకార్డులపై స్వచ్ఛభారత్, సేవ్ వాటర్, సేవ్ ఎన్విరాన్‌మెంట్, మొక్కలను రక్షించుకుందా తదితర సందేశాత్మక చిత్రాలు గీసి అబ్బుర పరిచారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియచేస్తూ ఆ చిత్రాలు గీసిన పోస్టుకార్డులను సోమవారం ఉపాధ్యాయులు, సహచర విద్యార్థులకు అందించారు. విద్యార్థులను హెచ్‌ఎం జి.సాయిబాబా, డ్రాయింగ్ టీచరు బత్తుల శ్రీనివాస్‌లు అభినందించారు.

పోరాటతత్వంతోనే హక్కుల సాధన

అమలాపురం టౌన్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): పోరాటేతత్వంతోనే హక్కులను సాధించుకోగలుగుతామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శవర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ అన్నారు. దేశ స్వాతంత్రోద్యమంలో కమ్యూనిస్టుల పాత్ర చరిత్ర ఎన్నటికీ మరువదన్నారు. సీపీఐ శత వసంతోత్సవ వేడుకల్లో భాగంగా సోమవారం పట్టణ వీధుల్లో జిల్లా కార్యదర్శి కె.సత్తిబాబు ఆధ్వర్యంలో కార్మిక, కర్షకులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ముస్లిం షాదీఖానా భవనంలో జరిగిన సభలో ప్రభాకర్ మాట్లాడారు. మణిపూర్‌లో ప్రజలను ఊచకోత కోస్తున్నా ప్రధాని మోదీ పట్టించుకోవడంలేదని, ప్రజా సమస్యలను గాలికొదిలి దేశాలు తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. సీపీఐ ఉద్యమ చరిత్రను సత్తిబాబు వివరించారు. ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు, బాలకృష్ణ, ఊటాల వెంకటేష్, నిమ్మకాయల శ్రీనివాసరావు, బొలిశెట్టి శంకరం, ఎంఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

6నుంచి యానాం ప్రజా ఉత్సవాలు


సీఎం రంగసామికి ప్రజాఉత్సవాలు ఆహ్వానపత్రికను అందజేస్తున్న మల్లాడి

యానాం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): యానాంలో ప్రతీ సంవత్సరం జనవరి 6నుంచి 8 వరకు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా జరిగే యానాం ప్రజా ఉత్సవాలకు పుదుచ్చేరి గవర్నర్, సీఎం పర్యటనలు ఖరారైనట్టు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తెలిపారు. ఈమేరకు పుదుచ్చేరి వెళ్లిన మల్లాడి గవర్నర్ కైలాష్‌నాథ్, ముఖ్యమంత్రి ఎన్.రంగసామిలతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా మల్లాడి వారికి ఆహ్వానపత్రికలను అందజేసారు. స్పీకర్ సెల్వం, మంత్రులు లక్ష్మీనారాయణ, తేనే జయకుమార్, తిరుమురుగన్‌తో పాటు కలెక్టర్, వివిధ శాఖల అధికారులకు ఆహ్వాన పత్రికలను అందజేశారు. అనంతరం మీడియాతో మల్లాడి మాట్లాడారు. యానానికి సంబంధించిన అనేక పెండింగ్ అంశాలపై చర్చించామన్నారు. యానాం ప్రజాఉత్సవాలకు సీఎం, గవర్నర్, మంత్రులు, అధికారులు హాజరవుతారన్నారు. జనవరి ఆరో తేదీ ఉదయం సీఎం యానాం వస్తారన్నారు. 8వ తేదీన జరిగే ముగింపు కార్యక్రమానికి గవర్నర్ కైలాష్‌నాథ్, పర్యాటకశాఖ మంత్రి లక్ష్మీనారాయణ, అధికారులుహాజరవుతారన్నారు.

'మా కులాన్ని మాకు ఇప్పించండి'


నిరసన తెలుపుతున్న బేడబుడ్గజంగం ప్రతినిధులు

అమలాపురం టౌన్, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో ఎవరి కులం వారికి ఉంది. 16ఏళ్లుగా మాకు కులం లేకుండా పోయింది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన కులాల జాబితాలో బేడబుడ్గజంగం కులం సీరియల్ నంబరు 9లో ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2008వరకు ఎస్సీ కుల ధ్రువీకరణపత్రాలు పొందాం. నాటి నుంచి నేటి వరకు ఎస్సీ కులధ్రువీకరణ పత్రాలకు నోచుకోలేదు. తమ సమస్యను పరిష్కరించాలని అప్పటి నుంచి ప్రజాప్రతినిధులు అధికారులను కలుస్తూనే ఉన్నాం. ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు అందక జిల్లాలోని 6వేల కుటుంబాల పిల్లలకు ఉపకార వేతనాలు లేవు. పెద్దలకు పెన్షన్లు లేవు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు లేకుండా పోయాయి' అని బేడబుడ్గజంగం జిల్లాశాఖ అధ్యక్షుడు పేర్ల దుర్గాప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ జాబితాలో బేడబుడ్గ జంగాలను చేర్చాలని నినాదాలు చేశారు. అనంతరం కలెక్టర్ మహేష్‌కుమార్‌ను కలిసి అర్జీ అందించారు. నిరసన కార్యక్రమంలో తాలూకా సంఘ అధ్యక్షుడు ముగ్గు శ్రీను, జిల్లా ఉపాధ్యక్షుడు ముగ్గు నాగేశ్వరరావు, కార్యదర్శి పేర్ల నాగరాజు, ఉప్పు కోటసత్యం, ముగ్గు పిచ్చియ్య, పేర్ల రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మీ కోసంలో 20 అర్జీలు

అమలాపురం టౌన్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక మీ కోసం కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ బి.కృష్ణారావు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి 20 అర్జీలను స్వీకరించి వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కింది స్థాయి అధికారులను ఆదేశించారు.

ఇంజనీరింగ్ డైరీ ఆవిష్కరణ

అమలాపురంటౌన్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విభాగంలో అత్యాధునిక సాంకేతిక అంశాలను క్రోడీకరించి ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు ఉపయోగపడే విధంగా జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగంలో ముద్రించిన 2025డైరీని సోమవారం కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆవిష్కరించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ అభివృద్ధి పనులను పారదర్శకంగా నిర్వహించాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు కలెక్టర్ సూచించారు. ఇంజనీరింగ్ సహాయకుల సమస్యలను అడిగి తెలుసుకుని చర్యలు తీసుకుంటామన్నారు.పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజనీర్ పి.రామకృష్ణారెడ్డి, డివిజనల్ ఇంజనీర్లు పీఎస్ రాజ్‌కుమార్, అన్యం రాంబాబు, 64మందిఇంజనీరింగ్ సహాయకులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

అమలాపురం టౌన్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆవిష్కరించారు. జిల్లా శాఖ అధ్యక్షుడు కేతా భాస్కరరామారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బీసీ ఉద్యోగులు ఐక్యంగా అందరి అభ్యున్నతికి పాటుపడాలని సూచించారు. కోశాధికారి రాజులపూడి సుబ్రహ్మణ్యేశ్వరరావు, గౌరవాధ్యక్షుడు గుబ్బల మల్లికార్జునరావు, ప్రధాన కార్యదర్శి అల్లుమిల్లి శ్రీనుబాబు, ఉపాధ్యక్షుడు ఎండీ నాగప్రసాద్, జీవీ రమణ, నగభేరి కృష్ణమూర్తి, డివిజన్ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు జీపీశెట్టి, పి.సత్యబాబు, రాయుడు రామకృష్ణ పాల్గొన్నారు.

న్యూఇయర్ వేడుకలకు పోలీసు బందోబస్తు

అమలాపురం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకలను ప్రశాంత వాతావరణం మధ్య ప్రజలు జరుపుకుని పోలీసు అధికారులకు సహకరించాలని ఎస్పీ బి.కృష్ణారావు కోరారు. నిబంధనలు ఉల్లంఘించి ఇష్టానుసారంగా 31వ తేదీ రాత్రి తిరిగితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో కీలకమైన ప్రాంతాల్లో 120 పోలీసు పికెట్లను ఏర్పాటు చేశామని, 40 మొబైల్ టీములను ఏర్పాటు చేయడం ద్వారా నిరంతర నిఘా ఉంటుందన్నారు. మద్యం సేవించి వాహనం నడిపితే డ్రంక్ అండ్ డ్రైవ్‌లో కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రశాంత పరిస్థితుల నడుమ నూతన సంవత్సర వేడుకలను జరుపుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఎక్కడైనా అశ్లీల కార్యక్రమాలు, ఇతర నేర సంబంధమైన చర్యలకు పాల్పడితే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

మైనింగ్ ఏజెన్సీ, రైతుల మధ్య ఘర్షణ

మలికిపురం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): శంకరగుప్తంలో సోమవారం మైనింగ్ ఏజెన్సీ, రైతుల మధ్య ఘర్షణ జరిగింది. మైనింగ్ పనుల కోసం సిబ్బంది వెళ్లడంతో గలాటా జరిగింది. శంకరగుప్తానికి చెందిన బుంగ జ్యోతి తన ఇంటి నిర్మాణం కోసం తన భూమిలోని మట్టిని తీసుకువెళుతుండగా మైనింగ్ సిబ్బంది అడ్డగించారని మలికిపురం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తమ అనుమతి లేకుండా ఎందుకు మట్టిని తరలిస్తున్నారంటూ మైనింగ్ సిబ్బంది అసభ్య పదజాలంతో దురుసుగా ప్రవర్తించినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై పోలీసుస్టేషన్‌లో ఇరువర్గాలు కేసులు నమోదు చేసుకున్నారు. ఘర్షణలో మైనింగ్ సిబ్బంది గాయపడినట్టు రాజోలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు తెలిసింది. కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పి.సురేష్ తెలిపారు.

'బహిరంగ ప్రదేశాల్లో వేడుకలు కుదరవు'

మలికిపురం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం సందర్భంగా బహిరంగ ప్రదేశాల్లో యువత కేక్‌లు కట్ చేయడం వంటి సంఘటనలు, మోటారు సైకిళ్లకు సైలెన్సర్లు లేకుండా తిరగడం వంటి పనులు చేస్తే చర్యలు తప్పవని మలికిపురం ఎస్ఐ బి.సురేష్ తెలిపారు. యువత మద్యం సేవించి వాహనాలు నడపరాదని, బాణసంచా కాల్చరాదని, ప్రభుత్వ ఉత్తర్వులను అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

మానేపల్లి వీఆర్ఏ రంగమ్మ మృతి

పి.గన్నవరం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మానేపల్లిలో 30ఏళ్లుగా సేవలందిస్తున్న వీఆర్ఏ నాగళ్ల రంగమ్మ(60) సోమవారం ఉదయం మృతి చెందింది. తహశీల్దార్ పి.శ్రీపల్లవి ఆదేశాలమేరకు డిప్యూటీ తహశీల్దార్ సత్యనారాయణ నివాళులర్పించి మట్టి ఖర్చులు కోసం ఆర్థిక సాయం అందించారు. అలాగే వీఆర్వోలు వి.సత్యనారాయణ, శివరామకృష్ణ, సిబ్బంది ప్రేమ్‌కుమార్, మురళి, నారాయణ, మండల వీఆర్వోలు, మండల వీఆర్ఏల సంఘ అధ్యక్షుడు కుంపట్ల రామకృష్ణ, వీఆర్ఏలు రంగమ్మకు నివాళులర్పించారు.

నడింపల్లి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

అల్లవరం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): కోడూరుపాడులో నడింపల్లి సత్యవతీదేవి మృతితో సతీ వియోగంతో బాధపడుతున్న టీడీపీ సీనియర్ నేత, ఎస్‌కేబీఎస్ కళాశాల కమిటీ చైర్మన్, సర్పంచ్ నడింపల్లి సుబ్రహ్మణ్యం రాజును ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, టీడీపీ రాష్ట్ర నేత మెట్ల రమణబాబు పరామర్శించారు. సత్యవతీదేవి చిత్రపటం వద్ద పుష్పాలు ఉంచి నివాళులర్పించారు. టీడీపీ మండల అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబు రాజు, బొర్రా ఈశ్వరరావు, నల్లా స్వామి, దంతులూరి వాసురాజు, చింతా శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు వెంకటనానిరాజు తదితరులు నడింపల్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కాయకల్ప అవార్డు ఎంపిక కోసం సీహెచ్‌సీ పరిశీలన

పి.గన్నవరం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): కాయకల్ప అవార్డు ఎంపికలో భాగంగా పి.గన్నవరం సీహెచ్‌సీని పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు సీహెచ్‌సీకి చెందిన డాక్టర్ రవికుమార్ పరిశీలించారు. ఆసుపత్రి వైద్యులు, సిబ్బందితో రవికుమార్ మాట్లాడి పలు సౌకర్యాలపై ఆరా తీశారు. పరిసరాలు ఎలా ఉన్నాయి, శానిటేషన్, రోగులకు అందుతున్న సేవలు, వార్డులు, ఆపరేషన్ థియేటర్, సిబ్బంది పనితీరు తదితర అంశాలను పరిశీలించారని ఆసుపత్రి సూపరింటెండెంట్ యు.రాఘవేంద్రావు తెలిపారు. మొదట రాష్ట్ర స్థాయిలో పరిశీలన ఉంటుందని, రాష్ట్ర స్థాయిలో ఎంపికైతే జాతీయ స్థాయిలో మరో ప్రత్యేకబృందం ఆసుపత్రిని పరిశీలన చేస్తుందన్నారు. ఈపరిశీలనలో డాక్టర్ అప్పారి సూర్యనారాయణ, డాక్టర్ కోటేశ్వరరావు, డాక్టర్ మాధురి, డాక్టర్ సంధ్యరాణి, డాక్టర్ మాధవి, ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ముమ్మిడివరం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): రజకులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, దళితులకు ప్రత్యేక రక్షణ చట్టం కల్పించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ముమ్మిడివరంలోని రజక సంక్షేమ భవనంలో సోమవారం రజక తాలూకా సంఘ సమావేశం జరిగింది. సమావేశానికి ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన మండలాలకు చెందిన రజకులు హాజరయ్యారు. నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా సామంతకుర్తి సుబ్బారావు, ఉపాధ్యక్షుడిగా ముమ్మిడివరపు వెంకన్నబాబు, కార్యదర్శిగా అవిడి వీరవెంకటసత్యనారాయణ, కోశాధికారి కోటిపల్లి అచ్యుతమోహనరావు, మరికొంతమంది సభ్యులతో నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. సమావేశంలో నూతనంగా ఎన్నికైన వారికి పూలమాలలు, దుశ్శాలువాలతో సన్మానించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ గొల్లపల్లి ధర్మారావును పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు.

'అమిత్‌షా క్షమాపణ చెప్పాలి'

కాట్రేనికోన, డిసెంబరు30(ఆంధ్రజ్యోతి):అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షా క్షమాపణ చెప్పాలని సీపీఎం డిమాండ్ చేసింది. పల్లంకుర్రు బస్టాండ్ వద్ద సోమవారం విప్పర్తి మోహనరావు, విత్తనాల రాంబాబు, సింహాద్రి, వాకపల్లి వెంకటేశ్వరరావు, కముజు సత్తిబాబు, రాయపురెడ్డి కృష్ణ, శ్రీను, సురేష్, సుధీర్, సత్యనారాయణ నిరసన చేపట్టారు.

కుండలేశ్వరం ఏటిగట్టు పరిశీలన

కాట్రేనికోన, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): కుండలేశ్వరం వద్ద క్రుంగిన ఏటిగట్టును జలవనరుల శాఖ ఉన్నతాధికారులు, కేంద్ర డిజైన్ల సంస్థ ఉన్నతాధికారులతో కలిసి ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు సోమవారం పరిశీలించారు. ఏటిగట్టును బలపరిచి, వెడల్పు చేసే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. ఐ.పోలవరం మండలం పెరుమల్లరాజుకోడు డ్రెయిన్‌పై అవుట్‌ఫాల్ స్లూయిజ్‌కు ఆటోమేటిక్ షట్టర్లు అమర్చవలసిందిగా కోరారు. ఎస్‌పిసి లాకు స్లూయిజ్‌ను వెడల్పు చేసి ఎత్తు పెంచాలన్నారు. కార్యక్రమంలో డిజైన్ల సంస్థ ఎస్ఈ శివకుమార్‌రెడ్డి, ఈఈలు శేషుబాబు, విజయసారథి, డీఈఈలు శ్రీనివాస్, రీనా, హెడ్‌వర్క్స్ అధికారులు కాశీవిశ్వేశ్వరరావు, ఇ.సుబ్బారావు, ఈశ్వరమణ్యం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సెక్రటరీకి గాయాలు

అల్లవరం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): దేవగుప్తంలో సోమవారం ఆటో ఢీకొన్న ఘటనలో గుండెపూడి సచివాలయ సెక్రటరీ మృదులకు గాయాలయ్యాయి. స్కూటీపై కార్యదర్శి మృదుల వెళ్తుండగా ఆటో ఢీకొని గాయపడింది. అమలాపురం ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న కార్యదర్శి మృదులను ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్, ఈవోపీఆర్డీ యు.నాగేంద్ర పరామర్శించారు.

ఆక్వారంగ సమస్యల పరిష్కారానికి కృషి: ఎమ్మెల్యే

ఐ.పోలవరం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆక్వా రంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు రైతులకు హామీ ఇచ్చారు. సోమవారం పాతయింజరంలో వీరేశ్వరా ఆక్వా డీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సన్మానించి జ్ఞాపిక అందించారు. అసోసియేషన్ అధ్యక్షుడు మంతెన మమ్మురాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆక్వా రంగం అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్టు చెప్పారు. రాయితీపై విద్యుత్ అందిస్తామన్నారు. ఫీడ్ ధరలు తగ్గించి పెట్టుబడి వ్యయాన్ని నియంత్రిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, చేకూరి కృష్ణరాజంరాజు, త్సవటపల్లి నాగు, నడింపల్లి సూర్యవర్మ, కోటిపల్లి ధర్మరాజు, ఆక్వా రైతులు పాల్గొన్నారు.

బంగారు నగల షాపు ఎదుట బాధితుడి నిరసన

ముమ్మిడివరం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): షాపు యజమాని వస్తువులు ఇవ్వకపోవడంతో ఓ వ్యక్తి సోమవారం ఆ షాపు ఎదుట కూర్చుని నిరసన వ్యక్తం చేశాడు. గాడిలంక మాజీ సర్పంచ్, ప్రస్తుతం కాకినాడలో ఉంటున్న దోనూరి వెంకటరమణ ముమ్మిడివరం గాంధీబొమ్మ సెంటర్‌లోని శ్రీ గాయత్రీ జ్యూవెలరీ వర్కుషాపులో ఆరేళ్ల క్రితం వస్తువులు తయారు చేయడానికి 13గ్రాముల బంగారం ఇచ్చాడు. ఇంతవరకు వస్తువులు తయారుచేసి ఇవ్వకుండా షాపు యజమానికి చెల్లూరి భవానీశంకర్ వాయిదాలు వేసుకుంటూ వస్తున్నాడని సోమవారం ఆ షాపు ఎదుట రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపాడు. షాపు యజమానికి అక్కడి నుంచి వెళ్లిపోవడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరసన కొనసాగించాడు.

పోస్టర్, క్యాలెండర్ ఆవిష్కరణ

అయినవిల్లి, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కల్వరి క్రీస్తు ప్రార్థనా మందిరం వారి నూతన సంవత్సర క్యాలెండర్, కల్వరి విమోచన మహోత్సవ పోస్టర్‌ను సోమవారం పాస్టర్ ఆకుల, సంఘ సభ్యుల సమక్షంలో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పెట్టా శేఖర్, ప్రసాద్, నాగరాజు, రాంజీ, దినకర్, ఎన్డీఏ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏటిగట్టు రోడ్డు పనులపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ఐ.పోలవరం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): కేశనకుర్రుపాలెం ఏటిగట్టు రోడ్డు పనులపై వైసీపీ నాయకులు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కోటి రూపాయల ఉపాధి నిధులతో కేశనకుర్రు పంచాయతీ పుగాకు లంక నాగమల్లిచెట్టు ఏటిగట్టు రోడ్డును బీటీ రోడ్డుగా ఆధునికీకరిస్తున్నారు. ఏటిగట్టుకు బెర్మ్ వేయకుండా అదే ఏటిగట్టును తవ్వి వచ్చిన మట్టినే వినియోగించడం వల్ల గట్టు పటిష్టత కోల్పోతుందని అన్నారు. వరదల సమయంలో ఇబ్బందులు వస్తాయని వివరించారు. వైసీపీ మండల కన్వీనర్ పిన్నమరాజు శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో ఫిర్యాదు సమర్పించారు.

రూ.3.60లక్షల ఉపకార వేతనాలు పంపిణీ

అమలాపురం రూరల్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాంకేతిక విద్యను అభ్యసిస్తున్న 190మంది దేవాంగ విద్యార్థులకు రూ.3.60లక్షల ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. శ్రీకోనసీమ దేవాంగ సంక్షేమ సంఘ కార్యవర్గ సమావేశం సోమవారం బండారులంక శ్రీఉమారామలింగచౌడేశ్వరి దేవస్థానంలో ఊటుకూరి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి అధ్యక్షతన నిర్వహించారు. త్వరలో సంఘ స్వర్ణోత్సవ వేడుకల నిర్వహణపై చర్చించారు. కార్యదర్శి పుత్సల వరదరాజులు, నాయకులు చింతా వీరభద్రేశ్వరరావు, గుంటు పాండురంగ, దైవపు నందయ్య, కటకం ధనలక్ష్మీశ్వరరావు, పిచ్చిక పోలిశెట్టి, బళ్ల వెంకటేశ్వరరావు, చింతపట్ల గంగాసత్యనారాయణ, మాడా రాము, యక్కల మెహర్, జాన గణేష్, యినుమర్తి లింగమూర్తి పాల్గొన్నారు.

దాట్లకు భారతి స్మారక పురస్కారం



యానాం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): యానానికి చెందిన ప్రముఖ కవి, కథకుడు దాట్ల దేవదానంరాజు విశాఖపట్నం పౌర గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో తటవర్తి భారతి స్మారక పురస్కారాన్ని అందుకున్నారు. అమెరికా నివాసి, తెలుగు భాషాభిమాని, రచయిత తటవర్తి త్రినాధ నాగేశ్వరరావు తెలుగు భాష అభివృద్ధి కృషిచేస్తున్న సాహితీవేత్తలకు నగదు, జ్ఞాపిక, శాలువాతో సత్కరిస్తున్నారు. ఈనేపథ్యంలో యానాం నుంచి కవి, కథకుడు దాట్ల దేవదానంరాజు తటవర్తి భారతి స్మారక పురస్కారం అందుకున్నారు.

మద్యం తాగి బైక్ నడిపితే సీజ్ చేస్తాం: సీఐ

అంబాజీపేట, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకలు సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పి.గన్నవరం సీఐ రుద్రరాజు భీమరాజు హెచ్చరించారు. అంబాజీపేట పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్పీ ఆదేశాల మేరకు సర్కిల్ పరిధి నాలుగుస్టేషన్ల ప్రాంతాల్లో నాకాబంది నిర్వహించి 113 వాహనాలు సీజ్ చేశామన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపినా, బహిరంగ ప్రదేశాల్లో పార్టీల పేరుతో అశ్లీల నృత్యాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఎస్ఐలు చిరంజీవి, చైతన్యకుమార్, శివకృష్ణ,జోషి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అమలాపురం టౌన్, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): కాకినాడ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న టీవీ మెకానిక్ గుబ్బల వెంకటేశ్వరరావు(34) సోమవారం మధ్యాహ్నం మృతిచెందినట్టు పట్టణ ఎస్ఐ ఎస్సార్ కిశోర్‌బాబు తెలిపారు. ఈనెల17న వడ్డిగూడెంలో మోటారుసైకిల్‌పై వెళుతుండగా వెనుక నుంచి మోటారుసైకిల్ ఢీకొట్టడంతో వెంకటేశ్వరరావుకు తీవ్ర గాయాలయ్యాయి. కాకినాడప్రైవేటు తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు.

దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు సూదా మృతి

ఉప్పలగుప్తం, డిసెంబరు30(ఆంధ్రజ్యోతి): ఉప్పలగుప్తం మండల దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వాడపర్రుకు చెందిన సూదా లక్ష్మీనారాయణ(39) అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సంఘ సభ్యులు, సహచరులు జనిపెల్ల సంపత్‌కుమార్, చాట్ల విద్యాసాగర్, మట్టపర్తి వెంకటేశ్వరరావు, చప్పిడి బుజ్జి, వీరా వెంకటేశ్వరరావు, నెల్లి వెంకట్, ఆకుల కిరణ్‌కుమార్, ఆకుల భార్గవ, బడుగు గణేష్, కోసాన సత్యసుబ్రహ్మణ్యం, నల్లా గుర్రయ్యనాయుడు సంతాపం వ్యక్తం చేశారు.

విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన

ముమ్మిడివరం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఆలోచనల్లో శాస్త్రీయ దృక్పథాన్ని వెలికితీసేందుకు విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతో ఉపయోగపడతాయని ఎంఈవోలు బొజ్జా రమణశ్రీ, ఆర్.ఉదయభాస్కరరావులు పేర్కొన్నారు. ముమ్మిడివరం జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించారు. మండలంలో 26ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు 160 ప్రదర్శనలు చేశారు. ఈప్రదర్శనలను సందర్శకులను ఆకట్టుకున్నాయి. విజేతలకు ఎంఈవోలు బహుమతులు అందజేశారు.

మండపేట



ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

నూకాంబికా ఆలయంలో చండీహోమం

ఆలమూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): చింతలూరు నూకాంబికా అమ్మవారి ఆలయంలో సోమవారం అమావాస్య సందర్భంగా చండీ హోమం జరిపారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి వుండవల్లి వీర్రాజు అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ హోమాన్ని పండితులు శాస్త్రోక్తంగా చేశారు. అధిక సంఖ్యలో భక్తులు హోమంలో పాల్గొని పూజలు చేశారు. దీన్ని తిలకించేందుకు పలు గ్రామాల భక్తజనం పాల్గొని అమ్మవారికి పూజలు జరిపారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులతో పాటు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

టిడ్కో సముదాయాల్లో చెత్త తొలగించాలి

మున్సిపల్ సిబ్బందికి ఎమ్మెల్యే వేగుళ్ల ఆదేశాలు



టిడ్కో గృహాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గొల్లపుంత కాలనీని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సోమవారం సందర్శించారు. కాలనీలో పెరిగిపోయిన చెత్తను తొలగించి పరిసరాలను శుభ్రపరచాలని మున్సిపల్ అధికారులను ఆయన ఆదేశించారు. అపార్ట్‌మెంట్‌ల చుట్టూ పూల మొక్కలు, పండ్లు, కూరగాయల పాదులను పెంచాలని ఆయన కాలనీవాసులకు సూచించారు. అపార్ట్‌మెంట్ల చుట్టూ పెరిగిపోయిన వ్యర్థాలు, చెత్త, చెదారాన్ని తొలగించే వరకు తాను పరిశీలిస్తూనే ఉంటానని తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ శానిటరీ అధికారి ముత్యాల సత్తిరాజు తదితరులు వున్నారు.

వాడపల్లికి పోటెత్తిన భక్తజనం

ఆత్రేయపురం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో సందడి నెలకొంది. వేకువజామునే స్వామివారికి గోదావరి జలాలను తీర్థపు బిందెతో తీసుకువచ్చి స్నపన మూర్తులకు అభిషేకం చేశారు. అనంతరం తిరుప్పావై వేదపారాయణం జరిపారు. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు చేశారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.2,68,922 వచ్చినట్టు ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

స్వామివారిని దర్శించుకున్న ఉంగుటూరు ఎమ్మెల్యే ధర్మరాజు: వాడపల్లి వేంకటేశ్వరస్వామిని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు కుటుంబ సభ్యులతో స్వామివారిని దర్శించారు. అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని వేదపండితుల ఆశీర్వచనం అందుకున్నారు.

రావులపాలెం: వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆవిష్కరించారు. రావులపాలెం టీడీపీ క్యాంపు కార్యాలయం వద్ద ఆలయ ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ కేవీ సత్యనారాయణరెడ్డి, ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ కరుటూరి నరసింహారావు, ముదునూరి వెంకట్రాజు, కాయల జగన్నాధం, కూటమి నాయకులు పాల్గొన్నారు.



వాడపల్లి వెంకన్న నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు, నాయకులు

శనేశ్వరస్వామి హుండీ లెక్కింపు

కొత్తపేట, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మందపల్లి శనేశ్వరస్వామి ఆలయ హుండీతో పాటు ప్రాంగణంలో ఉన్న వేణుగోపాలస్వామి హుండీ, అన్నప్రసాద ట్రస్టు హుండీని ఉప్పలపాటి జానికమ్మ సత్రం, పొడగట్లపల్లి ఈవో ఎం.రాధాకృష్ణ ఆధ్వర్యంలో లెక్కించారు. ఆరు నెలలకు గాను శనేశ్వరస్వామి హుండీ రూ.6,85,870లు, 31.5 గ్రాముల బంగారం, 754 గ్రాముల వెండి, విదేశీ కరెన్సీ వచ్చిందన్నారు. అన్నదాన ట్రస్టుకు రూ.26,067, వేణుగోపాలస్వామి ఆలయ హుండి రూ.32,957, నాలుగు గ్రాముల వెండి వచ్చినట్టు ఆలయ ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. కార్యక్రమంలో ఎస్.వీరవెంకట సత్యనారాయణ, ఎ.వెంకటేశ్వరరావు, వీఆర్వో ఉత్తర కుమారి తదితరులు పాల్గొన్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని వామపక్షాల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న వామపక్షాల నాయకులు

రామచంద్రపురం(ద్రాక్షారామ), డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షాను కేంద్ర మంత్రివర్గం నుంచి తొలగించాలని మంగళవారం రామచంద్రపురంలో వామపక్షాలు రాస్తారోకో జరిపారు. ఈ సందర్భంగా సీపీఐ, సీపీఎం, సీపీఐ (ఎంఎల్), న్యూడెమోక్రసీ నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐ కెఎంఎస్ నాయకులు అంబటి కృష్ణ, సీహెచ్ రాజారెడ్డి, సీపీఎం నాయకులు బలరాం, సీపీఐ నాయకులు పెద్దిరెడ్డి రాము, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు బి.సిద్ధూ, వెంటపల్లి భీమశంకరం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వామివారికి పంచామృతాభిషేకం, సహస్రనామార్చన

కపిలేశ్వరపురం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురంలోనున్న జనార్దనస్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, అమ్మవార్లకు సహస్రనామ కుంకుమార్చన ఘనంగా జరిపారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ పర్యవేక్షణలో భక్తుల సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. వేదపండితులు పెద్దింటి లక్ష్మీనరసింహాచార్యులు ఆధ్వర్యంలో పెద్దింటి వెంకటరమణాచార్యులు, భార్గవ్ స్వామివారికి అభిషేకాలు, పూజలను చేశారు. మహిళలు అమ్మవారికి సహస్రనామ కుంకుమార్చన చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.



స్వామివారికి పంచామృతాభిషేకం చేస్తున్న వెంకటరమణాచార్యులు

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

రావులపాలెం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): రావులపాలెం జడ్పీ బాలుర పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. పాఠశాల చైర్మన్ నందం వీరవెంకట సత్యనారాయణ ఆర్థికసాయంతో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘంలో ఉన్న అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో రూపొందించిన పదవ తరగతి స్టడీ మెటీరియల్‌ను రావులపాలెం మండలంలోని 9 జడ్పీ పాఠశాలలో చదువుతున్న 611 మంది విద్యార్థులకు జడ్పీటీసీ కుడిపూడి శ్రీనివాసరావు, నందం వీరవెంకట సత్యనారాయణ, కోట సోమేష్, ఎంఈవో శ్రీనివాసరాజు, ఎస్ఎస్ఏ అధికారి డి.రమేష్‌బాబు అందచేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ సంఘ సభ్యులు అడపా శ్రీనివాసరావు, కుసుమే కింగ్, మరియన్‌రాజు, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉపకేంద్రాన్ని సందర్శించిన విద్యార్థులు

కపిలేశ్వరపురం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుమూడి వద్ద ఉన్న విద్యుత్ ఉపకేంద్రాన్ని మాచర ఉన్నత పాఠశాల విద్యార్థులు సోమవారం సందర్శించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా పియంశ్రీ పాఠశాలగా ఎంపిక కాబడ్డ పాఠశాలలోని లెవెల్ 1, లెవెల్ 2 విద్యార్థులు విద్యుత్ ఉపకేంద్రాన్ని సందర్శించినట్లు పాఠశాల హెచ్ఎం రమాదేవి తెలిపారు. వారి వెంట ఉపాధ్యాయులు రాజశేఖర్, శివశ్రీను, వొకేషనల్ శిక్షకుడు శ్రీనుబాబు ఉన్నారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

రాయవరం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్య సాధ్యమవుతుందని పిరమిడ్ మాస్టర్లు తాడి సూరయ్యమ్మ, సీహెచ్ సూర్యకుమారి పిలుపునిచ్చారు. సోమవారం రాయవరం సత్యసాయి సేవా మందిరంలో ధ్యాన శిక్షణా నిర్వహించారు. ఈసందర్భంగా పిరమిడ్ మాస్టర్లను సత్కరించారు. కార్యక్రమంలో జి.కాశీ విశ్వనాధం, వెలగల ఫణికృష్ణారెడ్డి, సీతాదేవి, వైట్ల రాజ్యలక్ష్మి, రాయవరం, తొస్సిపూడి, సోమేశ్వరం, కొప్పవరం, పులుగుర్త గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా దుకాణాల తొలగింపు

ద్రాక్షారామ, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ మార్కెట్‌లో అరటిపండ్ల దుకాణదారులు సోమవారం స్వచ్ఛందంగా తొలగించారు. షాపు యజమాని డీపీవోకు తన షాపునకు దారిలేకుండా అరటిపండ్ల దుకాణాలు ఏర్పాటు చేశారని ఫిర్యాదు చేయడంతో వారికి పంచాయతీ నోటీసులు జారీ చేసింది. దీంతో స్వచ్ఛందంగా వారు తొలగించారు.

అసంపూర్తిగా అంగన్‌వాడీ భవనాలు

• నిధుల లేమితో ఆగిన నిర్మాణాలు • అద్దె భవనాల్లో కొనసాగుతున్న వైనం

ఆత్రేయపురం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం గ్రామంలో ప్రభుత్వ నిధులతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాలు నిధుల లేమితో అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఆత్రేయపురం పెదపేట, చిన్నపేటలో నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో అద్దె భవనాల్లో అంగన్‌వాడీ సెంటర్లు నిర్వహిస్తున్నారు. దశాబ్ద కాలం నుంచి ఇవి నిరుపయోగంగా ఉన్నాయి. అప్పట్లో ఎంపీ, ఎమ్మెల్యే నిధులతో వీటిని నిర్మించారు. గుమ్మాలు, కిటికీలు, ఫ్లోరింగ్, విద్యుత్ తదితర పనులు చేపట్టకపోవడంతో అసంపూర్తిగా నిలిచిపోయాయి. అంగన్‌వాడీ పిల్లలకు అనువుగా నిర్మించిన ఈ భవనాలు ఇప్పటికీ వినియోగంలోకి రాలేదు. అంగన్‌వాడీ భవనాలపై పాలకులు దృష్టిపెట్టకపోవడంతో ఇవి శిథిలస్థితికి వచ్చేశాయి. ప్రారంభం కాకుండానే హాలులో పుట్టలు వెలిశాయి. కూటమి ప్రభుత్వం దృష్టిసారించి వీటి పనులు పూర్తి చేయాలని ఈ ప్రాంత వాసులు కోరుతున్నారు.



ఆత్రేయపురం పెదపేట, చిన్నపేటలో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనం

పేకాట శిబిరంపై దాడి

ఆలమూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం నర్సిపూడిలో పేకాట ఆడుతున్న శిబిరంపై ఆలమూరు పోలీసులు దాడి చేశారు. రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్‌కు అందిన సమాచారం మేరకు ఆలమూరు ఎస్ఐ ఎం.అశోక్ సిబ్బందితో దాడి చేయగా పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.21,100 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ అశోక్‌కుమార్ తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు.

విశ్వకర్మ యోజన కౌశల్య పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

రామచంద్రపురం(ద్రాక్షారామ), డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): విశ్వకర్మ యోజన కౌశల్య పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా స్కిల్ డెవలప్‌మెంటు అధికారి డి.హరిశేషు అన్నారు. మంగళవారం కామాక్షి దుర్గా కార్పెంటర్స్ అసోసియేషన్ కార్యాలయంలో విశ్వకర్మ యోజన కౌశల్య పథకం అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఆన్‌లైన్ జరుగుతున్నదని 18 ఏళ్లు నిండిన కార్మికులు ఉపయోగించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కార్పెంటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అప్పారి శ్రీనివాస్, కార్యదర్శి డి.సూర్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ ఏర్పాట్లు పూర్తి

కె.గంగవరం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): సామాజిక పింఛన్లను మంగళవారం పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేసినట్టు ఎంపీడీవో ఎన్.శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని 26 గ్రామాల్లో మంగళవారం ఉదయం 6 గంటల నుంచి సచివాలయ సిబ్బంది పింఛన్ దారుల ఇంటికి వెళ్లి అందిస్తారని ఆయన తెలిపారు.

క్రాఫ్ట్ పోటీల్లో సింధూజకు ప్రథమస్థానం

ద్రాక్షారామ, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): కాకినాడలో జరిగిన క్రియ పోటీల్లో క్రాఫ్ట్ పోటీల్లో జూనియర్స్ విభాగంలో రామచంద్రపురం మండలం నరసాపురపుపేట జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి దేవళ్ల పూర్వ సింధూజ రాష్ట్రస్థాయి ప్రథమస్థానం సాధించింది. ప్రథమస్థానం పొందిన విద్యార్థిని, గైడ్ టీచర్ ధనలక్ష్మిని సర్పంచ్ చాట్రాదీ వీరలక్ష్మి, ఎంపీటీసీ పరమటి జ్ఞానలక్ష్మి, ఎస్ఎంసీ చైర్‌పర్సన్ పోలవరకు కృష్ణవేణి, వైస్ చైర్‌పర్సన్ పులపకూర శ్రీనివాసు, హెచ్ఎం కెకెఎల్ కుమారి, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

సోమేశ్వరం విద్యార్థుల ప్రతిభ

రాయవరం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): కాకినాడలో 28న క్రియ సంస్థ నిర్వహించిన పిల్లల పండుగలో సోమేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి బహుమతులు అందుకున్నట్లు హెచ్ఎం దయామణి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ పాటలు సీనియర్స్ విభాగంలో పి.మల్లేశ్వరి, పి.శిరీష, సత్యవేణి, ఎస్.ఈశ్వరి, ఆర్.నరసింహ, ఆకాంక్ష తదితరులు 2వ బహుమతి, డిబేట్‌లో ఎస్.నాగరమ్మ, బుదాల శ్రీనివాస్, అర్జున్ రెండోవ బహుమతి సాధించినట్లు చెప్పారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు జెఎన్‌టీయూ వీసీ మురళీకృష్ణ, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాష్ నారాయణ తదితరులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంగీత ఉపాధ్యాయురాలు సాలగ్రామ మాధవి, క్రాఫ్ట్ టీచర్ డి.శేషారత్నం తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్

కపిలేశ్వరపురం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం మండలస్థాయి సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. ఎంఈవో కె.తాతారావు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో సైన్స్ ఫెయిర్ నోడల్ ఆఫీసర్, అంగర హైస్కూల్ హెచ్ఎం అంగర రాజు, సైన్స్ ఉపాధ్యాయులు, పాఠశాల ఇన్‌చార్జ్ జె.రమేష్‌బాబు, పాఠశాల హెచ్ఎం వంగా శ్రీనివాస్, వివిధ పాఠశాలల హెచ్ఎంలు, సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. వ్యక్తిగత విభాగంలో టేకి ఉన్నత పాఠశాల విద్యార్థిని ఆర్.అమృతసుస్మిత సోలార్ పవర్ ఇరిగేషన్‌లో ప్రథమ బహుమతి సాధించింది. గ్రూప్ ప్రాజెక్టు విభాగంలో కాలేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి డి. రోహన్ ఏజ్‌కాల్క్యులేషన్‌లో ప్రథమ సాధించాడు. వ్యక్తిగత విభాగం నుంచి శ్రీరామకృష్ణ హైస్కూల్ అంగర ప్రైవేటు పాఠశాలకు చెందిన పి.గాయత్రి డే అఫ్ ద డేట్ నుంచి ప్రథమ బహుమతి సాధించింది. ప్రైవేటు పాఠశాల గ్రూపు విభాగం నుంచి శ్రీ రామకృష్ణ హైస్కూల్ అంగరకు చెందిన కె. మనోహర్ సోలార్ క్లిప్స్‌లో ప్రథమ బహుమతి సాధించినట్లు ఎంఈవో తాతారావు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో తాతారావు, నోడల్ ఆఫీసర్ ఎ.రాజు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు ర్యాంపు నిర్వహణ జరగాలి

కపిలేశ్వరపురం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలను అనుసరించి ఇసుక ర్యాంపు నిర్వహణ జరగాలని రామచంద్రపురం ఆర్డీవో అఖిల అన్నారు. సోమవారం కపిలేశ్వరపురం ఇసుక ర్యాంపును ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ జియో కోఆర్డినేట్ పరిధిలో యంత్రాలను వినియోగించకుండా మాన్యువల్‌గా ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 వరకు మాత్రమే తవ్వకాలు జరపాలన్నారు. అక్రమాలకు తావులేకుండా ర్యాంపు నిర్వహించాలని నిర్వాహకులను ఆమె ఆదేశించారు. ఆమె వెంట తహసీల్దార్ పి. చిన్నారావు, ఆర్ఐ అర్జమ్మ, శ్రీనివాస్, కార్యదర్శి శివచక్రవర్తి, వీఆర్వోలు, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది, ర్యాంపు నిర్వాహకులు ఉన్నారు.



ఇసుక ర్యాంపుల నిర్వహణపై సూచనలు చేస్తున్న ఆర్డీవో అఖిల

యాజమాన్య కమిటీలు బాధ్యతతో పనిచేయాలి

కొత్తపేట, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): పాఠశాల యజమాన్య కమిటీలు బాధ్యతతో విధులు నిర్వర్తించాలని జిల్లా విద్యాశాఖాధికారి సలీం బాషా పేర్కొన్నారు. సోమవారం కొత్తపేట ఎంఈవో కార్యాలయంలో ఏడు మండలాల పాఠశాలలకు సంబంధించి 35 మందితో పాఠశాల యజమాన్య కమిటీలు ఏర్పాటు చేశారు. వారికి ఒకరోజు శిక్షణ విద్యాశాఖాధికారులు ఎం.హరిప్రసాద్, కె.లీలావతిల అధ్యక్షతన శిక్షణ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డీఈవో హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో డీసీఈబీ సెక్రటరీ బీర హనుమంతరావు, హెచ్ఎంలు బండారు దుర్గాప్రసాద్, కేవీ శేఖర్, ఎస్ఈ ప్రసాద్, ఎం.నాగరాజు, ఎల్ఎస్‌వో కోఆర్డినేటర్ రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో సలీంబాషా

‘పంచాయతీ కార్యాలయాల్లో మోదీ ఫొటో పెట్టాలి’



రాయవరం ఎంపీడీవో కీర్తి స్పందనకు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

రాయవరం, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఫొటో పెట్టాలని బీజేపీ నాయకులు సోమవారం రాయవరం ఎంపీడీవో ఎస్.కీర్తి స్పందనకు వినతి పత్రం ఇచ్చారు. ఈసందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ పంచాయతీ కార్యాలయాల్లో ప్రధాని ఫొటో పెట్టేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోకు వినతిపత్రం ఇచ్చినట్టు చెప్పారు. అనంతరం ఇటీవల రాయవరం ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన డి.సురేష్‌బాబును కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో లొల్ల సర్పంచ్ చాట్రాతి జానకి రాంబాబు, చిరట్ల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలు పరిష్కారం

ఆలమూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకుని భూ సమస్యలను తక్షణం పరిష్కరించుకోవాలని డిప్యూటీ తహశీల్దార్ సుబ్బరాజు అన్నారు. ఆలమూరు మండలం మడికిలో డీటీ సుబ్బరాజు అధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఆత్రేయపురం: రెవెన్యూ సదస్సుల్లో భూసమస్యలను పరిష్కరించుకోవాలని తహశీల్దారు రాజేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం వెలిచేరు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పలువురు అర్జీలను అందించగా, వీటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.



మండపేటలో భగవద్గీతపై ప్రచారం చేస్తున్న ట్రస్టు సభ్యులు

భగవద్గీతపై ప్రచారం

మండపేట, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి) త్రైత సిద్ధాంత ప్రబోధసేవా సమితి రాజ మహేంద్రవరం శాఖ ప్రబోధానంద యోగీశ్వ రులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత అనుబంధ గ్రంథాలను సోమవారం మండపేట పరిసర ప్రాంతాల్లో ప్రదర్శించి ప్రచారం చేశారు. మండపేటతోపాటు అనపర్తి మండలం పులగుర్త తదితర ప్రాంతాల్లో సభ్యులు ప్రచారం చేసి భగవద్గీతపై ప్రచారం చేశారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం సేవా సమితి అధ్యక్షుడు శేఖర్‌బాబు, లక్ష్మీ నారాయణ, విజయ్, లోహిత్, సూర్యకుమారి, భరత్, సంధ్యారాణి, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎంసీ చైర్మన్లకు శిక్షణ

ద్రాక్షారామ, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండల విద్యా వనరుల కేంద్రంలో మంగళవారం డివిజన్‌లో 5 మండలాల స్కూల్ మేనేజ్‌మెంటు చైర్మన్లకు శిక్షణా తరగతులు నిర్వహించారు. రామచంద్రపురం, కె.గంగవరం, కపిలేశ్వరపురం, రాయవరం, మండపేట మండలాలకు చెందిన డీఆర్‌పీలు, ఎస్ఎంసీ చైర్మన్‌లకు ఎస్ఎంసీ నిధులు గురించి శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన వారి జనవరి 2, 3 తేదీలలో ఆయా మండలాల్లో శిక్షణ ఇస్తారని తెలిపారు.

గ్రీవెన్స్‌కు 5 దరఖాస్తులు

రామచంద్రపురం(ద్రాక్షారామ): రామచంద్రపురం రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీకోసం గ్రీవెన్స్‌కు 5 దరఖాస్తులు వచ్చినట్లు ఆర్డీవో అఖిల తెలిపారు. 22 ఏ నిషేధిత జాబితా నుంచి తొలగింపునకు 2, భూ సర్వేకు 1, సామాజిక భవనం నిర్మాణానికి స్థలం కేటాయించాలని 1, చోడవరం ఎంపీపీ పాఠశాలలో ఆయా ఉద్యోగం పునరుద్ధరించాలని దరఖాస్తు వచ్చిందన్నారు

టెన్త్ స్టడీ మెటీరియల్స్ ఆవిష్కరణ

ఆలమూరు, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో విద్యార్థులకు సులభమైన పద్ధతిలో ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం అధ్వర్యంలో రూపొందించిన స్టడీ మెటీరియల్స్‌ను మండల అధికారుల సమక్షంలో సోమవారం ఆవిష్కరించారు. ఎస్టీయు మండల శాఖ అధ్వర్యంలో పదో తరగతి స్టడీ మెటీరియల్స్‌ను ఎంపీడీవో ఎ.రాజు, తహశీల్దార్ కెజె. ప్రకాష్‌బాబు, ఎంఈవోలు అప్పాజీ, సుబ్బరాజు, మండల పరిషత్ ఏవో మెహర్‌ప్రకాష్, ఎస్టీయు నాయకులు వంశీకృష్ణ, దుర్గాప్రసాద్, రాజగోపాల్, చక్రవర్తి ఆవిష్కరించారు. సాధారణ స్థాయి విద్యార్థులకు సైతం అర్థమయ్యే రీతిలో స్టడీ మెటీరియల్స్ రూపొందించడం జరిగిందని ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల్లో వాటాలుంటే నిరూపించాలి

వైసీపీనేత ఎమ్మెల్సీ తోట

మండపేట, డిసెంబరు, 30(ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాల్లో తనకు వాటాలు ఉందన్న ఆరోపణలను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు నిరూపించాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సవాల్ చేశారు. మండపేటలో వైసీపీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనపై ఆయన చేసిన ఆరోపణలను ఎమ్మెల్సీ తోసిపుచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మద్యం దుకాణాల్లో పావలావాటా ఎమ్మెల్యే వేగుళ్ల తీసుకున్న మాట వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. మద్యం దుకాణాల్లో వేగుళ్లకు వాటా లేకుంటే బెల్టు దుకాణాలను ఎందుకు ప్రోత్సహిస్తున్నారని ప్రశ్నించారు. విద్యుత్ చార్జీల పెంపునకు గత ప్రభుత్వం కారణమని చెప్పటం ఏమిటన్నారు. ఉచిత ఇసుక ఇస్తామని చెప్పి ఇప్పుడు ఇసుక ర్యాంపుల్లో బాటచార్జీల పేరిట ప్రభుత్వం దోపిడి చేస్తున్నదని ఆరోపించారు. కపిలేశ్వరపురం మండలంలో అనుమతులు ఒకచోట ఉంటే మరోచోట ఇసుక తవ్వకాలుసాగించి నిల్వ చేస్తున్నారని ఇందులో ఎమ్మెల్యే అనుచరుడు ముఖ్యపాత్ర పోషిస్తున్నాడని ఆరోపించారు. తాను తరచూ పార్టీలు మారుతుంటానని వేగుళ్ల ఆరోపణలను ఖండించారు. నియోజకవర్గంలో ఇసుక దోపిడీపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశానన్నారు. సమావేశంలో వైసీపీ నేతలు రెడ్డి రాధాకృష్ణ, పట్టణ అధ్యక్షుడు ముమ్మిడివరపు బాపిరాజు, మాజీ ఎంపీపీ ఎస్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

బీసీల పక్షపాతి చంద్రబాబు

మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు బీసీల పక్షపాతిగా రుజువు చేసుకున్నారని మంత్రి సుభాష్ పేర్కొన్నారు. బీసీ వర్గానికి చెందిన విజయానంద్‌ను సీఎస్‌గా నియమించినందుకు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. జగన్ పాలనలో బీసీలను గుర్తించలేదన్నారు.

పుష్పగుచ్ఛాలు, దండలు వద్దు

రామచంద్రపురం(ద్రాక్షారామ), డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): నూతన ఆంగ్ల సంవత్సరాన్ని పురస్కరించుకుని జనవరి 1న వీఎస్ఎం కళాశాలలో అందుబాటులో ఉంటానని మంత్రి సుభాష్ తెలిపారు. అభిమానులు, అధికారులు, కార్యకర్తలు, నాయకులు తనకు శుభాకాంక్షలు తెలిపేందుకు పుష్పగుచ్ఛాలు, పూలదండలు తీసుకురావద్దని కోరారు. ఎవరైనా తీసుకురాలనుకుంటే నిత్యావసర వస్తువులు, దుప్పట్లు విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాలు, పెన్నులు తీసుకురావాలని కోరారు.

నూతన సంవత్సర వేడుకల్లో హద్దు మీరితే చర్యలు

రామచంద్రపురం(ద్రాక్షారామ),డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సర వేడుకల్లో ప్రజలకు అసౌకర్యం, ఇబ్బంది కలిగిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం రాత్రి గుంపులుగా గుమిగూడటం, మద్యం సేవించి వాహనాలు నడపడం, సైలెన్సరు తీసి బైక్‌లు నడపడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కూడళ్లలో పోలీసు పికెట్‌లు ఏర్పాటు చేశామన్నారు.

కె.గంగవరం: నూతన సంవత్సర వేడుకలను నిబంధనలకు లోబడి జరుపుకోవాలని పామర్రు ఎస్ఐ ఎస్.కె. జానీ బాషా కోరారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అర్ధరాత్రి రోడ్డు మీద కేక్ కటింగ్‌లు, సైలెన్సర్లు తీసి వాహనాలు నడపడం వంటి ఇబ్బందికరమైన పనులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

కొత్తపేట, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం, సంక్రాంతి వేడుకలను నిబంధనలకు లోబడి జరుపుకోవాలని కొత్తపేట ఎస్ఐ జి.సురేంద్ర తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి లైసెన్స్ లేని వాహనాలకు ఫైన్ వేశారు. నెంబరు లేకుండా సైలెన్సర్లు తీసేసిన వాహనాలను సీజ్ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

పూలదండలు, బొకేలు వద్దు

కొత్తపేట, డిసెంబరు 30(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే బండారు సత్యానందరావును కలిసేందుకు వచ్చే నాయకులు, కార్యకర్తలు, అధికారులు, అభిమానులు పూలదండలు, బొకేలు తేవద్దని వారు కోరారు. వాటికి బదులుగా పుస్తకాలు, పెన్నులు అందివ్వాలని టీడీపీ అధికార జిల్లా ప్రతినిధి ముత్యాల బాబ్జి తెలిపారు. వీటికి బదులుగా ఇచ్చే పెన్నులు, పుస్తకాలు విద్యార్థులకు ఉపయోగపడతాయని తెలిపారు.

బలరామ అవతారంలో దర్శనమిచ్చిన వేంకటేశ్వరస్వామి



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

రాయవరం, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): దశావతార ఉత్సవాల్లో భాగంగా రాయవరం శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి సోమవారం బలరామ అవతారంలో పూజలందుకున్నారు. భక్త సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో స్వామివారిని బలరామ అవతారంలో అలంకరించి పూజలు చేశారు. అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు అంగర బాబు, పెద్దింటి కృష్ణమాచార్యులు, భక్త సంఘం సభ్యులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు మోడల్ పేపర్లు అందజేత

మండపేట, డిసెంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వున్న ఎస్ఎస్‌వీపీ మున్సిపల్ హైస్కూల్‌లో పదవ తరగతి విద్యార్థులకు యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ కె.గోపాలకృష్ణారెడ్డి తన తల్లిదండ్రుల పేరిట పదవ తరగతి మోడల్ పేపర్లను అందించారు. మండల విద్యాధికారి ఎన్. రామచంద్రరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.